

# చైతన్యరథం

సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

కుక్కతోక పాక్..
ఒప్పందం ఉల్లంఘన!
4

జాతీయ రక్షణ నిధికి
స్పీకర్ అయ్యన్న
నెల జీతం విరాళం
4



## తొలగిన యుద్ధమేఘాలు!

### తోక ముడిచిన పిరికిస్థాన్

- భారత్, పాక్ కాల్పుల విరమణ ఒప్పందం
- భారత్‌ను ఒప్పించాలంటూ అమెరికాతో దాయాది కాళ్లబేరం
- ట్రంప్ దౌత్యంతో సరేనన్న భారత్
- ఉగ్రవాదంపై రాజీ లేదని స్పష్టీకరణ

4

*భారత బలగాల దెబ్బకు పాకిస్థాన్ తోకముడిచింది. దుస్సాహసంతో పాకిస్థాన్ సైన్యం రెచ్చగొట్టే చర్యలకు దిగటంతో భారత్ గట్టిగా తిప్పికొట్టింది. భారత్ ఎదురుదాడితో బిక్కచచ్చిన పాకిస్తాన్ వేరే దారిలేక వెనక్కి తగ్గింది. చివరకు అమెరికాను రాయబారం కోసం వేడుకోగా, ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దౌత్యంతో భారతదేశం కాల్పుల విరమణకు అంగీకరించింది. ఆపరేషన్ సిందూర్ తరువాత పాకిస్థాన్‌లో వణుకు మొదలయింది. భారత్ ఇంత తీవ్రంగా స్పందిస్తుందని, దాడులు చేస్తుందని ఊహించలేదు. మూడు రోజుల్లో పాకిస్థాన్ కీలక స్థావరాలను భారత్ ధ్వంసం చేసింది. కోలుకోలేని దెబ్బకొట్టింది. దీంతో భయపడ్డ పాకిస్థాన్ రెండో రోజునుంచే మూడో శక్తి జోక్యం కోరింది. కాల్పుల విరమణకు తాము సిద్ధమేనని పబ్లిక్‌గా ప్రకటించింది. టర్కీ తప్ప ఏ ఇస్లామిక్ దేశం కూడా పాకిస్థాన్‌కి సాయంగా ముందుకు రాలేదు.. దీంతో అమెరికాను బతిమాలి, రాజీ చర్చలకు ఒప్పించింది.*

# నేషన్ ఫస్ట్!

- ❑ ఇదే అందరి నినాదం కావాలి
- ❑ దేశం కోసం అంతా ఏకతాటిపైకి రావడం గొప్ప విశేషం
- ❑ ప్రపంచాన్ని పీడిస్తున్న అతిపెద్ద సమస్య ఉగ్రవాదం
- ❑ ఉగ్రవాదంపై పోరులో త్రివిధ దళాలకు మద్దతుగా ఉందాం
- ❑ భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణ శుభపరిణామం
- ❑ దేశ సమగ్రతకు ప్రధాని, కేంద్రం ఏ నిర్ణయం తీసుకున్నా తెలుగుజాతి అండగా ఉంటుంది
- ❑ ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటన
- ❑ రాజ్‌భవన్‌లో గవర్నర్ ఆధ్వర్యంలో జరిగిన సర్వమత సమావేశానికి హాజరైన సీఎం




2

ఇకపై ఉగ్రదాడులను..
## యుద్ధంగానే పరిగణిస్తాం
## భారత్ గట్టి హెచ్చరిక
- ప్రధాని మోదీ అధ్యక్షతన ఉన్నతస్థాయి సమావేశంలో నిర్ణయం

12

## ఐక్యతే మన బలం
*- సీఎం చంద్రబాబు*






## ఇదీ నిజం!

- ఇకనైనా ఫేక్ ప్రచారాలు మానుకో
- జగన్‌రెడ్డికి మంత్రి లోకేష్ స్ట్రాంగ్ కౌంటర్
- నా సొంత డబ్బుతో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ
- కుట్టు మిషన్లు, టైలరింగ్ మెటీరియల్ కూడా నా డబ్బుతోనే పంపిణీ
- నా సొంత సొమ్ము కాబట్టే శుభానికి సంకేతమైన పసుపు రంగు మిషన్లు ఇచ్చాం
- నీలా ప్రభుత్వ ధనంతో పార్టీ రంగులు, సొంత పేర్లు పెట్టుకునే నీచ బుద్ధి మాకు లేదు
- నీ అబద్ధం తాత్కాలికం, మా నిజం శాశ్వతం

3



మంగళగిరి నియోజకవర్గంలో..
## స్త్రీశక్తి కాంతులు

- మహిళల స్వయం ఉపాధికి నారా లోకేష్ ఆలోచన నుంచి పుట్టిన పథకం
- ఇప్పటివరకూ 3508 మంది మహిళలకు శిక్షణ
- నారా లోకేష్ సొంత నిధులతో ఉచితంగా 3508 కుట్టు మిషన్లు పంపిణీ
- అద్భుత పథకం అంటున్న లబ్ధిదారులు

3

## సీమకు జగన్‌రెడ్డి శాపం.. చంద్రన్న వరం

5

- సాగునీటి ప్రాజెక్టులపై వైసీపీ మొసలి కన్నీరు
- ఐదేళ్ల పాలనలో కేటాయించింది రూ.2,011 కోట్లే
- రాయలసీమ వాసులను నిండా ముంచిన జగన్‌రెడ్డి
- చంద్రబాబు హయాంలో పరుగులు పెట్టిన ప్రాజెక్టులు
- 2014-19 మధ్యలోనే రూ.12,441 కోట్లు ఖర్చు
- హంద్రీనీవాకు నేడు అధిక నిధులు..జూలై 10 డెడ్‌లైన్
- గోదావరి-బనకచర్ల ద్వారా కోనసీమగా రాయలసీమ

## స్వగ్రామానికి అమరజవాన్ పార్థివ దేహం
## నివాళులర్పించిన మంత్రి సవిత

4






చైతన్యరథం

# నేషన్ ఫస్ట్!





- ఇదే అందరి నినాదం కావాలి
- దేశం కోసం అంతా ఏకతాటిపైకి రావడం గొప్ప విశేషం
- ప్రపంచాన్ని పీడిస్తున్న అతిపెద్ద సమస్య ఉగ్రవాదం
- ఉగ్రవాదంపై పోరులో త్రివిధ దళాలకు మద్దతుగా ఉందాం
- భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణ శుభపరిణామం
- దేశ సమగ్రతకు ప్రధాని, కేంద్రం ఏ నిర్ణయం తీసుకున్నా తెలుగుజాతి అండగా ఉంటుంది
- ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటన
- రాజ్‌భవన్‌లో గవర్నర్ ఆధ్వర్యంలో జరిగిన సర్వమత సమావేశానికి హాజరైన సీఎం

అమరావతి (చైతన్యరథం): మనం ఏ పరిస్థితుల్లో ఉన్నా నేషన్ ఫస్ట్ (దేశమే ప్రధానం) అనే నినాదంతో దేశాన్ని కాపాడుకోవాల్సి ఉందని, దేశ భద్రతకు ఎలాంటి సమస్య వచ్చినా భారతదేశంలో ఉండే ప్రతి ఒక్కరూ సంఘటితంగా ఉండాల్సిన బాధ్యత అందరి పై ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడు కోవటంలో అందరం కలిసికట్టుగా ఉండాలన్నారు. ప్రపంచ శాంతిని ఉగ్రవాదం పట్టి పీడిస్తోందని, తీవ్రవాదం, ఉగ్రవాదం దేశంలో అనిశ్చిత పరిస్థితులకు, ఆర్థిక ఇబ్బందులకు కారణం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో రాజ్ భవన్‌లో శనివారం గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్ ఫెయిత్ (సర్వమత) కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడారు.

## పహల్గాంలో మారణకాండ సృష్టించారు

పహల్గాంలో ఉగ్రవాదులు మారణకాండ సృష్టించారు. ఉగ్రవాదుల కాల్పుల్లో 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఇది పర్యాట కులపై జరిగిన దాడి కాదు... దేశ శాంతి, సుస్థిరత లను దెబ్బతీసే అంశం. మనందరం కులమతాలకు అతీతంగా ముక్త కంఠంతో ఉగ్రదాడిని ఖండించాం. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యుల బాధను ఎవరూ తీర్చ లేరు. ఉగ్రవాదుల కాల్పుల్లో మన రాష్ట్రానికి చెందిన ఇద్దరు పర్యాటకులు చనిపోయారు. మన దేశం ఉగ్రవాదంపై పోరాడుతోంది. పహల్గాం కాల్పుల తర్వాత సరిహద్దుల్లో ఐదారు రోజులుగా ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ సమయంలో మన త్రివిధ దళాలు వీరోచితంగా పోరాడాయి. ఈ పోరాటంలో కొందరు సైనికులు, పౌరులు ప్రాణాలు కోల్పోయారు. యుద్ధంలో మన రాష్ట్రానికి చెందిన వీర సైనికుడు మురళీ నాయక్ ప్రాణాలు వదిలారు. 25ఏళ్ల వయసులో దేశ రక్షణ కోసం ప్రాణాలు వదిలారు. తన దేహంపై జాతీయ జెండా కప్పుకుని చనిపోతానని చెప్పి వీరోచితంగా పాకిస్తాన్‌తో పోరాడి మురళీనాయక్ చనిపోయారని సీఎం చంద్రబాబు ఉద్వేగంతో చెప్పారు.

## ప్రజల్ని బాధపెట్టే ఉగ్రవాదాన్ని ఉపేక్షించం

ఇతర దేశాలను దెబ్బతీసే ఆలోచన భారతదేశం చేయదు. మనదేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకుంటూనే ఎవరైనా మనమీదకు వస్తే గట్టిగా సమాధానమిస్తాం. ప్రజల్ని బాధపెట్టే తీవ్రవాదం, ఉగ్రవాదాన్ని ఎప్పటికీ ఉపేక్షించం. దేశంలోని ప్రతి కులం, ప్రాంతం, మతం దేశంకోసం పని చేస్తామని చెప్పాయి. ప్రజాస్వామ్యంలో విభేదాలు ఉండొచ్చు. అభిప్రాయలు, సిద్ధాంతాలను ఏకీభవించకపోవచ్చు. కానీ రాష్ట్ర, దేశ భవిష్యత్ కోసం ఎప్పుడూ వెనకడుగు వేసిన సందర్భాలు లేవు. మత విద్వేషాలు లేని రాష్ట్రం ఏపీ. అందుకే ఇక్కడ అన్ని మతాల ప్రతినిధులతో కలిసి సమావేశం ఏర్పాటు చేసుకున్నాం. దేశ రక్షణలో ప్రాణాలు పోగొట్టుకున్న సైనికుల త్యాగాన్ని మనం గుర్తు చేసుకుని సంఘీభావంగా ఉండాలి. భారతదేశం చేసే పోరాటానికి సంఘీభావాన్ని తెలియజేయాలి. సరిహద్దు రాష్ట్రాల్లోని ప్రజలు ఐదారు రోజులు బాంబుల మోతతో ఇబ్బందులు పడ్డారు. చదువుకునే విద్యార్థులు స్వరాష్ట్రాలకు తిరిగొచ్చారని సీఎం చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు.



## కాల్పుల విరమణ శుభపరిణామం

శనివారం మధ్యాహ్నం 3.30 గంటలకు భారత్-పాక్ దేశాల ఆర్మీ ఉన్నతాధికారులు మాట్లాడుకుని కాల్పుల విరమణ చేయాలని నిర్ణయించారు. ఈ పిలుపు కూడా ముందు పాకిస్తాన్ నుంచి రావడంతోనే భారత్ అంగీకరించింది. మన దేశానికి యుద్ధం చేయాలనే ఆలోచన లేదు. కానీ ఉగ్రవాదం, తీవ్రవాదంపై రాజీలేని పోరాటం చేస్తామని కేంద్రం తెలిపింది. రెండు దేశాల ప్రతినిధులు 12వ తేదీన సమీక్ష చేసుకుంటామని ప్రకటించాయి. యుద్ధంలో నష్టపోయిన వారందరికీ సంతాపం తెలుపుతూ తీర్మానం చేద్దాం. దేశ సమగ్రతకు ప్రధాని, కేంద్రం ఏ నిర్ణయం తీసుకున్నా తెలుగుజాతి, ఏపీ ప్రజలు అండగా ఉంటారని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.





## ఐక్యతే మన బలం

### - సీఎం చంద్రబాబు

అమరావతి (చైతన్యరథం): భారతీయులుగా ఎట్టి పరిస్థితుల్లోనూ దేశమే అన్నిటికన్నా ముఖ్యమనే సిద్ధాంతంతో తామందరం కలిసికట్టుగా ఉంటామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రాజ్‌భవన్‌లో గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం జరిగిన సర్వమత సమావేశానికి సీఎం చంద్రబాబు హాజరయ్యారు.

అనంతరం దీనిపై ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. రాజ్ భవన్‌లో గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ ఏర్పాటు చేసిన సర్వమత సమావేశంలో పాల్గొనే గౌరవం నాకు లభించింది. ఈ సమావేశంలో అన్ని మతాల పెద్దలు కలిసి తీవ్ర ప్రతికూల పరిస్థితుల్లోనూ భారతదేశ ఐక్యతను హృదయపూర్వకంగా ఆవిష్కరించారు. ఎలాంటి కష్ట సమయాలనయినా అందరం ఒకటిగా నిలిచి బలంగా ఎదుర్కొనేందుకు ఈ ఐక్యత దోహదపడుతుంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో అసమాన ధైర్యసాహసాలు ప్రదర్శించిన భారత సాయుధ దళాలకు అందరం కలిసి నివాళులర్పించాం. పహల్గామ్ ఉగ్రవాద దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారిని స్మరించుకున్నాం. అలాగే యుద్ధ కష్టాలను ధైర్యంగా ఎదుర్కొంటున్న మన సరిహద్దు రాష్ట్రాల పౌరుల త్యాగాలకు అభినందనలు తెలియజేశాం. ఏదేమైనా భారతీయులుగా ఎల్లప్పుడూ దేశమే ముందు అనేది మన నినాదం అని సీఎం చంద్రబాబు పోస్ట్ చేశారు.

# ఇదీ నిజం!

- ఇకనైనా ఫేక్ ప్రచారాలు మానుకో
- జగన్‌రెడ్డికి మంత్రి లోకేష్ స్ట్రాంగ్ కౌంటర్
- నా సొంత డబ్బుతో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ
- కుట్టు మిషన్లు, టైలరింగ్ మెటీరియల్ కూడా నా డబ్బుతోనే పంపిణీ
- నా సొంత సొమ్ము కాబట్టే శుభానికి సంకేతమైన పసుపు రంగు మిషన్లు ఇచ్చాం
- నీలా ప్రభుత్వ ధనంతో పార్టీ రంగులు, సొంత పేర్లు పెట్టుకునే నీచ బుద్ధి మాకు లేదు
- నీ అబద్ధం తాత్కాలికం, మా నిజం శాశ్వతం




అమరావతి (చైతన్యరథం): ప్రభుత్వ సొమ్ముతో కుట్టుమిషన్లను కొని పసుపు రంగు వేసి అందిస్తున్నారంటూ వైఎస్ జగన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ గట్టిగా తిప్పికొట్టారు. ఫేక్ పార్టీ వైసీపీకి ఎక్స్ వేదికగా మంత్రి లోకేష్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు.

జగన్ అధికారంలో ఉన్న ఐదేళ్లూ ప్రజలని గాలికి వదిలేసి, జనం సొమ్ము దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. అప్పుడు నేను ఎమ్మెల్యేనీ కూడా కాను. ప్రజల కోసమే పుట్టిన తెలుగుదేశం పార్టీ నాయకుడిగా, నా మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు స్వయం ఉపాధికి చేయూతనందించాలని నిర్ణయించుకున్నాను. మహిళలు, చేనేతలు, స్వర్ణకారులు, చిరువ్యాపారులకు అవసరమైన సామాగ్రి, ఆర్థిక సాయంతో చేయూతనందించాను. వీటన్నింటికీ నా సొంత నిధులు వెచ్చించాను. కుల, మత అంతరాలు పాటించకుండా... తమ కాళ్లపై తాము నిలబడాలనుకునే మహిళామణులు వేలాది మందికి స్త్రీశక్తి పేరుతో ఉచితంగా శిక్షణ ఇచ్చి, ట్రైనింగ్ పూర్తయ్యాక సర్టిఫికెట్లు, ఉచితంగా టైలరింగ్ మిషన్, మెటీరియల్ అందజేశానని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు.

మంగళగిరి స్త్రీ శక్తి కేంద్రం 2022, జూన్20న ప్రారంభించాం. ఈ కేంద్రంలో ఇప్పటి వరకూ 43 బ్యాచుల్లో 2226 మంది శిక్షణ పూర్తి చేసుకోగా, వీరందరికీ మిషన్లు అందజేశాం. తాడేపల్లిలో స్త్రీ శక్తి కేంద్రం 2023, ఫిబ్రవరి 1న ప్రారంభమైంది. ఇక్కడ 17 బ్యాచుల్లో శిక్షణ తీసుకున్న 666 మందికి మిషన్లు ఉచితంగా ఇచ్చాం. దుగ్గిరాలలో 2023 ఏప్రిల్ 10న ఆరంభించిన స్త్రీశక్తి కేంద్రంలో 16 బ్యాచుల్లో 616 మంది ట్రైనింగ్ పూర్తి చేసుకోగా, వీరందరికీ మిషన్లు పంపిణీ చేశాం. ఇప్పటి వరకూ 3508 మందికి శిక్షణ పూర్తిచేసి, ఉచితంగా నాణ్యమైన కుట్టు మిషన్లు అందజేశాం.

ఇవన్నీ నా జేబులోంచి తీసిన డబ్బులు, నా ఖాతాల నుంచి వెచ్చించిన సొమ్ములు కాబట్టే... శుభానికి సంకేతమైన నా పార్టీ పసుపు రంగు మిషన్లు ఇచ్చాను. జనం సొమ్ముతో పెట్టిన పథకాలకు నీలా పార్టీ రంగులు వేసుకోవటం, నీ పేర్లు పెట్టుకోవటం లాంటి కక్కుర్తి పనులు మేం చేయం. ఆ యావ మాకు లేదు. నీ అబద్ధం తాత్కాలికం. మా నిజం శాశ్వతం. ఇకనైనా ఫేక్ ప్రచారాలు మానుకోవాలని మంత్రి లోకేష్ ట్వీట్ చేశారు.



### వీరజవాన్ అంత్యక్రియలకు
## నేడు మంత్రి లోకేష్

అమరావతి (చైతన్యరథం): జమ్ముకాశ్మీర్‌లో పాకిస్థాన్ మూకల కాల్పుల్లో వీర మరణం పొందిన జవాను మురళీ నాయక్ అంత్య క్రియల్లో విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ పాల్గొననున్నారు. ఇందుకోసం మంత్రి లోకేష్ ఆదివారం శ్రీసత్యసాయి జిల్లాలో పర్యటించనున్నారు. యుద్ధభూమిలో వీరమరణం పొందిన మురళీనాయక్ స్వగ్రామం గోరంట్ల మండలంలోని కళ్లితాండ వెళ్లి అమర వీరుడి పార్థివ దేహానికి మంత్రి లోకేష్ నివాళులు అర్పిస్తారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, అంత్యక్రియల్లో పాల్గొంటారు.

ఇలాఉంటే వీర జవాన్ అంత్య క్రియలు అధికారిక, సైనిక లాంఛ నాలతో జరుగుతాయి. ఈ అంత్య క్రియలకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్,హోం మంత్రి వంగలపూడి అనిత కూడా హాజరవుతారు.

### మంగళగిరి నియోజకవర్గంలో..
# స్త్రీశక్తి కాంతులు

- మహిళల స్వయం ఉపాధికి నారా లోకేష్ ఆలోచన నుంచి పుట్టిన పథకం
- ఇప్పటి వరకూ 3508 మంది మహిళలకు శిక్షణ
- నారా లోకేష్ సొంత నిధులతో ఉచితంగా 3508 కుట్టు మిషన్లు పంపిణీ
- అద్భుత పథకం అంటున్న లబ్ధిదారులు







అమరావతి (చైతన్యరథం): సహజంగా ఊళ్లలో పాత ఇళ్లలో ఏ గుమ్మం చూసినా పసుపు రంగులో కనిపిస్తుంది. శుభానికి సంకేతం అయిన పసుపు కొందరు పూస్తే, మరికొందరు పసుపు రంగు పెయింట్ చేస్తారు. మంగళగిరి నియోజకవర్గంలోని వేలాది ఇళ్లలో స్వయం ఉపాధి శుభ సంకేతం పసుపు రంగులో కుట్టు మిషన్లు మనకు దర్శనమిస్తాయి. ఇవన్నీ 2022 నుంచి నేటివరకూ యువనేత నారా లోకేష్ తన సొంత నిధులతో మహిళామణుల స్వయం ఉపాధి కోసం ఉచితంగా అందించినవే..

మంగళగిరి నియోజకవర్గం నుంచి 2019లో టీడీపీ అభ్యర్థిగా పోటీచేసిన పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ స్వల్ప మెజారిటీతో ఓడిపోయారు. అపజయం పాలైనా, తనను ఇంతగా ఆదరించిన ప్రజల మంచిచెడ్డలు చూడటం తన బాధ్యతగా భావించారు.

తమ కాళ్లపై తాము నిలబడాలనుకునే వారికి చేయూతనందించేందుకు వివిధవర్గాల సంక్షేమానికి ఏడు పథకాలు రూపొందించి, పకడ్బందీగా అమలు చేశారు. చేనేతలు, స్వర్ణకారులు, మహిళలు, చిరువ్యాపారుల స్వయం ఉపాధికి తన సొంతనిధులతో పరికరాలు, సామాగ్రి, పెట్టుబడిగా అందజేశారు.

తెలుగుదేశం పార్టీ మహిళా సాధికారతకు చేసిన కృషిని తన తాత ఎన్టీఆర్, తండ్రి చంద్రబాబు నుంచి వారసత్వంగా స్వీకరించారు నారా లోకేష్. తల్లి భువనేశ్వరి ఆశీస్సులు, భార్య బ్రాహ్మణి ప్రోత్సాహంతో స్త్రీశక్తి పథకానికి రూపకల్పన చేశారు.

మంగళగిరి నియోజకవర్గంలో కుల,మతాలకు అతీతంగా ఆసక్తి గల మహిళలకు ఉచితంగా బ్యూటీషియన్ కోర్సు, టైలరింగ్ శిక్షణకు ఉద్దేశించిన స్త్రీశక్తి పథకాన్ని ప్రారంభించారు.

మంగళగిరి నియోజకవర్గ కేంద్రంలో తొలి స్త్రీ శక్తి కేంద్రం 2022, జూన్20 ప్రారంభించారు. ఈ కేంద్రంలో ఇప్పటివరకూ 43 బ్యాచుల్లో 2226 మందికి నిపుణులైన వారితో శిక్షణ ఇప్పించారు. శిక్షణాకాలంలో దారం-సూది కూడా మహిళలు తీసుకురావాల్సిన అవసరం లేకుండా, కేంద్రం నుంచే ఉచితంగా సరఫరా చేశారు. శిక్షణ పూర్తి చేసుకున్న 2226 మందికి సర్టిఫికెట్లు అందజేసి, కుట్టుమిషన్లు ఉచితంగా అందజేశారు.

ఆసక్తి గల మహిళలు అధిక సంఖ్యలో వస్తుండడంతో నియోజకవర్గంలో ఇతర మండలాలోనూ స్త్రీశక్తి కేంద్రాలు నెలకొల్పారు. తాడేపల్లిలో స్త్రీ శక్తి కేంద్రం 2023, ఫిబ్రవరి 1న ప్రారంభమైంది. ఇక్కడ 17 బ్యాచుల్లో శిక్షణ తీసుకున్న 666 మందికి ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. దుగ్గిరాలలో 2023 ఏప్రిల్ 10న ఆరంభించిన స్త్రీశక్తి కేంద్రంలో 16 బ్యాచుల్లో 616 మంది ట్రైనింగ్ పూర్తి చేసుకోగా, వీరందరికీ మిషన్లు అందజేశారు. మొత్తం నియోజకవర్గంలో ఇప్పటివరకూ 3508 మందికి శిక్షణ పూర్తిచేసుకోగా, ఉచితంగా నాణ్యమైన కుట్టు మిషన్లు అందజేశారు. వీరంతా ఇప్పుడు టైలరింగ్ షాపులు, ఇళ్లల్లోనూ టైలరింగ్ ద్వారా ఉపాధి పొందుతున్నారు.

మూడేళ్లుగా విజయవంతంగా నడుస్తున్న స్త్రీ శక్తి పథకానికి ఖర్చు అయిన ప్రతీ రూపాయి నారా లోకేష్ తన సొంత నిధుల నుంచే వెచ్చిస్తున్నారు.

# తొలగిన యుద్ధమేఘాలు

## తోక ముడిచిన పిరికిస్థాన్



- భారత్, పాక్ కాల్పుల విరమణ ఒప్పందం
- సయోధ్య కుదర్చాలంటూ అమెరికాతో దాయాది కాళ్లబేరం
- ట్రంప్ దౌత్యంతో సరేనన్న భారత్
- ఉగ్రవాదంపై రాజీ లేదని స్పష్టీకరణ

న్యూఢిల్లీ: భారత బలగాల దెబ్బకు పాకిస్థాన్ తోకముడిచింది. దీంతో యుద్ధమేఘాలు తొలగిపోయాయి. భారత్, పాకిస్తాన్ దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న ఉద్రిక్తతలకు తెరపడింది. కాల్పుల విరమణకు ఇరు దేశాలు అంగీకరించినట్లు భారత విదేశాంగశాఖ ప్రకటించింది. శనివారం సాయంత్రం 5గంటల నుంచి ఇవి అమల్లోకి వచ్చినట్లు తెలిపింది. అయితే భారత్ ఈ కాల్పుల విరమణకు అంగీకరించే ముందు విధాన పరంగా ఓ కఠిన నిర్ణయం తీసుకుంది. భారత్ ఇకపై ఉగ్రవాద దాడులు జరిగితే.. వాటిని యుద్ధంగానే భావించి చర్యలు తీసుకుంటామని ప్రకటించింది. పాకిస్తాన్‌లో శిక్షణ పొందిన టెర్రరిస్టులు కశ్మీర్ కో.. మరో చోటకో వచ్చి దాడులు చేస్తే పాకిస్తాన్ చేసిన యుద్ధంగానే భావిస్తామని కేంద్రం తేల్చి చెప్పింది.

గత మూడు రోజుల్లో దుస్సాహసంతో పాకిస్థాన్ సైన్యం రెచ్చగొట్టే చర్యలకు పాల్పడగా భారత్ గట్టిగా బదులిచ్చింది. భారత్ ఎదురుదాడితో బిక్కచచ్చిన పాకిస్తాన్ ఎట్టకేలకు వెనక్కి తగ్గింది. చివరకు అమెరికాను రాయబారం కోసం వేడుకోగా, ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చర్చలతో భారతదేశం కాల్పుల విరమణకు అంగీకరించింది.

శనివారం సాయంత్రం భారత విదేశాంగశాఖ ప్రతినిధి విక్రమ్ మిస్రీ మాట్లాడుతూ... మధ్యాహ్నం 3.35 గంటలకు ఇరుదేశాల డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్ (డీజీఎంవో) స్థాయిలో ఇరుదేశాల మధ్య చర్చలు జరిగాయన్నారు. పాకిస్థాన్ డీజీఎంవో భారత డీజీఎంవోకు ఫోన్ చేశారు. కాల్పుల విరమణకు ఇరు దేశాల సైనికాధికారులు అంగీకరించారు. సాయంత్రం 5గంటల నుంచి ఇది అమల్లోకి వచ్చింది. భూ, గగన, సముద్రతలాల నుంచి ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ కొనసాగుతుంది. వీటికి సంబంధించి ఇరుదేశాల సైన్యానికి తగిన ఆదేశాలు వెళ్లాయి. ఈ నెల 12న సాయంత్రం డీజీఎంవోలు మళ్లీ చర్చలు జరుపుతారని మిస్రీ వెల్లడించారు.

### ట్రంప్ దౌత్యం

కాల్పుల విరమించామంటూ భారత్-పాక్ ధ్రువీకరించడానికి కొద్ది ముందే ..ఇరుదేశాల మధ్య సయోధ్య కుదిరిందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. భారత్, పాక్ దేశాల మధ్య రాత్రంతా జరిపిన మధ్యవర్తిత్వం ఫలించిందని, యుద్ధ విరమణకు భారత్, పాక్ అంగీకరించినందుకు సంతోషంగా ఉందని ట్రంప్ అన్నారు. అమెరికా మధ్యవర్తిత్వంతో జరిగిన సుదీర్ఘ చర్చల తర్వాత, భారత్ , పాకిస్తాన్ కాల్పుల విరమణకు అంగీకరించాయని పేర్కొన్నారు. ఈ నిర్ణయాన్ని రెండు దేశాలు తెలివిగా, బాధ్యతాయుతంగా తీసుకున్నాయని అభినందించారు. వెంటనే పాక్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్.. ఈ ప్రకటన నిజమేనని కాల్పుల విరమణకు అంగీకరించామని ట్వీట్ చేశారు. భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రి కూడా ఇదే విషయాన్ని ప్రకటించారు. ట్రంప్ గత ప్రకటనలు చూసి ఇదంతా ఆయన గేమ్ ఆడుతున్నారని అనుకున్నారు. కానీ ట్రంప్ ట్వీట్ చేసిన కాసేపటికే.. కాల్పుల విరమణ ఒప్పందం గురించి రెండు దేశాలూ అధికారికంగా ప్రకటించాయి.

### పాక్ కాళ్లబేరం

చేసిన తప్పుడు పనిని సమర్థించుకోక తప్పని పరిస్థితుల్లో ఉగ్రవాదం కోసం దేశాన్ని పణంగా పెట్టాల్సిన పరిస్థితిని పాకిస్థాన్ ఎదుర్కొంది. రెండు, మూడు రోజులకే తీవ్రమైన సైనిక, ఆర్థిక నష్టాన్ని చూసింది. ఇంకా కొనసాగిస్తే.. దివాలా తీయడం ఖాయమని అర్థమైపోయింది. పాకిస్తాన్‌కు ఇప్పుడు ఉగ్రవాదుల్ని కాపాడటం కంటే తమ దేశం చీలకుండా చూసుకోవడం కీలకం. బలూచిస్తాన్‌లో .. బలూచ్ లిబరేషన్ ఆర్మీ పట్టు సాధించింది. అక్కడ వందల మంది సైనికులు చనిపోతున్నారు. ఈ దశలో పాకిస్తాన్‌కు మరో ఆప్షన్ లేకుండా పోయింది. తెగేదాకా లాక్కోకుండా కాళ్ల బేరానికి వచ్చేసింది. అంతకంతకూ ఊబిలో కూరుకుపోతున్న తమ దేశాన్ని కాపాడాలని అగ్రరాజ్యమైన అమెరికాను వేడుకుంది. ఈ క్రమంలో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియోతో పాకిస్థాన్ ఉప ప్రధానమంత్రి ఇషాక్ దార్ ఫోన్ ద్వారా మాట్లాడారు. ఇండియాతో శాంతి ఒప్పందం కుదుర్చాలని వేడుకున్నారు. ట్రంప్ కూడా జోక్యం చేసుకోవాలని కోరారు. దీంతో అమెరికా రంగంలోకి దిగాల్సివచ్చింది.

### వ్యూహాత్మకంగా భారత్

భారత్ కూడా వ్యూహాత్మకంగా వ్యవహరించింది. పెహల్గాం లాంటి ఉగ్రవాద ఘటనలు చేపడితే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉంటుందో చేతల్లో చూపించింది. వంద మందికిపైగా ఉగ్రవాదుల్ని చంపేసింది. పాకిస్తాన్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థను నాశనం చేసింది. ఆర్థికంగా కట్టడి చేసింది. ఈ దెబ్బతో పాకిస్తాన్ పూర్తిగా కుదేలయింది. ప్రపంచంలో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఎదిగే ప్రయత్నంలో ఉన్న భారత్ .. ఇలాంటి అవాంఛనీయమైన పరిస్థితుల్ని ఎక్కువ రోజులు కొనసాగించనీయకూడదు. అందుకే పాకిస్తాన్ కాళ్ల బేరానికి రాగానే.. ఓకే చెప్పింది.

### కీలకంగా డీజీఎంవోలు

ఈ వ్యవహారంలో సైన్యంలోని డీజీఎంవో స్థాయి అధికారులు కీలకంగా వ్యవహరించారు. పరిస్థితులు తీవ్ర రూపం దాల్చుతున్న వేళ వీరి మధ్య పరస్పర అవగాహనతో ఉద్రిక్తతలకు తాత్కాలికంగా తెరపడినట్లయ్యింది. సైనిక కార్యకలాపాల పర్యవేక్షణ, సమన్వయం చేసుకోవడంలో డీజీఎంవోలదే కీలక పాత్ర. సైన్యంలో సీనియర్ అధికారి స్థాయిలో ఉండే వీరు సైనిక ఆపరేషన్లలో వ్యూహాత్మక, కార్యాచరణను అమలు చేస్తుంటారు. ఆర్మీ చీఫ్‌తో నేరుగా సంప్రదింపులు జరుపుతూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందిస్తుంటారు. ప్రత్యర్థులపై దాడులు, శత్రుమూకలను దీటుగా ఎదుర్కొనే సైనిక ఆపరేషన్లకు వ్యూహాలు రచిస్తుంటారు. బలగాలను సిద్ధం చేయడం. రంగంలోకి దించడం వంటి విధులతోపాటు శాంతి పరిరక్షణలోనూ కీలకంగా వ్యవహరిస్తారు. సంయుక్త ఆపరేషన్ల సమయంలో వివిధ విభాగాల అధిపతుల మధ్య సంధానకర్తగా ఉంటారు. ఆటు నిఘా వ్యవస్థలతోనూ సమన్వయం చేసుకుంటూ వ్యూహాలు రచిస్తారు. ఇక మనదేశంలో కాల్పుల విరమణ ఒప్పందాలు, సరిహద్దు ఉద్రిక్తతల వేళ డీజీఎంవోదే కీలక పాత్ర. రెండు దేశాల మధ్య ఘర్షణాత్మక వాతావరణం ఏర్పడినప్పుడు తొలుత డీజీఎంవోల మధ్యే సంప్రదింపులు కొనసాగుతాయి. ఉద్రిక్తతలు తగ్గించడం, ఆయా దేశాల ఉద్దేశాలను వివరించడం, సాధ్యమైనవాటిని తక్షణమే పరిష్కరించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తారు.

### ఉగ్రవాదంపై రాజీపడేది లేదు: జైశంకర్

ఇరు దేశాల మధ్య కుదిరిన కాల్పుల విరమణపై విదేశాంగశాఖ మంత్రి ఎస్ జైశంకర్ ఎక్స్ వేదికగా స్పందించారు. కాల్పుల విరమణ, సైనిక చర్యలను నిలిపివేయడంపై భారత్,పాక్ ఓ అవగాహనకు వచ్చా యన్నారు. ఉగ్రవాద విషయంలో మాత్రం భారత్ తన రాజీలేని వైఖరిని కొనసాగిస్తుందని పేర్కొన్నారు.

### ఊపిరి పీల్చుకున్న సరిహద్దు గ్రామాలు

కాగా, ఇరు దేశాల మధ్య యుద్ధ వాతావరణం నేపథ్యంలో భారత సరిహద్దుల్లో ఉన్న పలు రాష్ట్రాల లోని ప్రజలు గత కొద్దిరోజులుగా ప్రాణాలు అరచేతి లో పెట్టుకొని నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. ఈ క్రమంలోనే కాల్పుల విరమణకు ఇరు దేశాలు అంగీక రించాయన్న వార్తవిని వారంతాఊపిరి పీల్చుకున్నారు.

### కాశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా హర్షం

ఈ నేపథ్యంలో జమ్ముకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా స్పందించారు. పూర్తిస్థాయి కాల్పుల విరమణ తక్షణం అమల్లోకి రావడాన్ని స్వాగతించారు. ఈ పరిణామాలు కాస్తంత ముందుగా జరిగి ఉంటే ఎన్నో ప్రాణాలను కాపాడగలిగి ఉండేవారమని అన్నారు. ఈ ఘర్షణలతో జరిగిన నష్టాన్ని ప్రభుత్వం ముదింపు వేసి బాధితులకు సాంత్వన కలిగించాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. గాయపడ్డ వారందరినీ ప్రభుత్వ పథకాలతో ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. త్వరలో ఎయిర్‌పోర్టులు తెరుచుకుని హజ్ యాత్ర యథాతథంగా కొనసాగుతుందని ఆశిస్తున్నట్టు పేర్కొన్నారు.

### కుక్కతోక పాక్.. ఒప్పందం ఉల్లంఘన!

న్యూఢిల్లీ: కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన కొన్నిగంటలకే పాకిస్తాన్ దానిని ఉల్లంఘించింది. జమ్ముకశ్మీర్‌తో పాటు ఇతర సరిహద్దు రాష్ట్రాల్లో పాక్ డ్రోన్ దాడులకు పాల్పడింది. దీనిపై విదే శాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ శనివారం రాత్రి ప్రెస్‌మీట్ ఏర్పాటుచేసి సరిహద్దుల్లో పాక్ కాల్పు ల విరమణను ఉల్లంఘించిందనిచెప్పారు.కాల్పుల విరమణ అవగాహనను ఉల్లంఘించడం సరి కాదు. డీజీఎంవోల మధ్య జరిగిన అవగాహనను ఉల్లంఘించడాన్ని ఖండిస్తున్నాం. భారత ఆర్మీకి పూర్తి స్వేచ్ఛ ఇచ్చాం. పరిస్థితిని భారత్ సమీక్షి స్తోంది. కాల్పుల విరమణ ఒప్పం దాన్ని ఉల్లం ఘించడం అత్యంత దుర్మార్గం. ఎల్‌వోసీ దగ్గర పాక్ కాల్పులకు పాల్పడింది. సరిహద్దుల్లో పాక్ ఉల్లంఘనలకు మన సైన్యం తగిన విధంగా జవా బిస్తుంది. సైనికులు కాల్పుల విరమణ ఒప్పందా న్ని ఉల్లంఘించకుండా పాక్ చర్యలు తీసు కోవాలి. కాల్పుల ఉల్లంఘనకు సంపూర్ణ బాధ్యత పాక్‌దే. దీనిని ఎదుర్కోవడానికి సైన్యం సర్వ సన్నద్ధంగా ఉంది. సైన్యానికి సంపూర్ణ అధికా రాలు ఇచ్చామని విక్రమ్ మిస్రీ స్పష్టం చేశారు.

---

## జాతీయ రక్షణ నిధికి స్పీకర్ అయ్యన్న నెల జీతం విరాళం

అమరావతి (చైతన్యరథం): భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు పెరిగిన నేపథ్యంలో ఏపీ అసెంబ్లీ స్పీకర్ చింత కాయల అయ్యన్నపాత్రుడు తన నెల వేతనాన్ని జాతీయ రక్షణ నిధికి విరాళంగా ఇచ్చారు. ఆన్‌లైన్ పేమెంట్ ద్వారా ఈ విరాళాన్ని స్పీకర్ అందజేశారు.



ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. దేశ సాయుధ దళాలు ఉగ్రవాద నిర్మూలనలో చూపిస్తున్న ధైర్యం ప్రతీ భారతీ యునికి గర్వకారణ మన్నారు. దేశ రక్షణ కోసం ప్రాణాలను పణంగా పెట్టి పోరాడుతున్న జవాన్లకు తన వంతు సంఘీభావంగా, సైనికు లకు బాసటగా తన నెల జీతం రూ.2,17,000/ జాతీయ రక్షణ నిధికి విరాళంగా అందజేసినట్లు తెలిపారు. దేశ భద్రత కోసం సాయుధ దళాలు చేస్తున్న కృషి దేశ ప్రజలందరిలో జాతీయ భావనను పెంపొందించాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు.

## స్వగ్రామానికి అమరజవాన్ పార్థివ దేహం

### నివాళులర్పించిన మంత్రి సవిత

పెనుకొండ (చైతన్యరథం): ఆపరేషన్ సిందూర్‌లో సరిహద్దుల్లో పోరాడుతూ వీరమరణం పొందిన వీర జవాన్, అగ్నివీర్ మురళీ నాయక్ పార్థివ దేహం స్వగ్రామానికి చేరుకుంది. పాక్ మూకల కాల్పుల్లో శుక్రవారం ఉదయం నేలకొరిగిన మురళీ నాయక్ పార్థివ దేహం శనివారం సాయంత్రం జమ్మూ కాశ్మీర్ నుండి బెంగళూరు విమానాశ్రయానికి చేరుకుంది. మిలిటరీ కాన్వాయ్ దాదాపు 300 వాహనాలతో కలిసి బయలుదేరి పెనుకొండ నియోజకవర్గం, గోరంట్ల మండలంలో మురళీ నాయక్ స్వగ్రామం కల్లితాండ గ్రామానికి చేరుకుంది. గుమ్మయ్యగారిపల్లి నుండి క్రాస్ నుండి కల్లితాండ వరకు మంత్రి సవితమ్మతో పాటు ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, వేలాది మంది ప్రజలతో కలిసి ఊరేగింపులో పాల్గొన్నారు. భారత్ మాతాకి జై, మురళీ నాయక్ అమర్ రహే అని నినాదాలు చేశారు.





చైతన్యరథం

# రాయలసీమకు జగన్ శాపం..

# చంద్రన్న వరం

- సాగునీటి ప్రాజెక్టులపై వైసీపీ మొసలి కన్నీరు
- గత ఐదేళ్లలో కేటాయించింది రూ.2,011 కోట్లే
- సీమ వాసులను నిండా ముంచిన జగన్‌రెడ్డి
- చంద్రబాబు హయాంలో పరుగులు పెట్టిన ప్రాజెక్టులు
- ఒక్క టీడీపీ పాలనలోనే రూ.12,441 కోట్ల ఖర్చు
- హంద్రీనీవాకు అధిక నిధులు.. జూలై 10 డెడ్‌లైన్
- గోదావరి-బనకచర్ల ద్వారా కోనసీమగా రాయలసీమ

రాయలసీమను రతనాల సీమగా మార్చాలనే సంకల్పంతో చంద్రన్న ఒకవైపు అహ ర్నిశలు శ్రమిస్తుంటే.. మరోవైపు ఆ ప్రాంత వైసీపీ నేతలు అది జీర్ణించుకోలేక జరుగు తున్న అభివృద్ధిపై బురద జల్లే పనిలో నిమగ్నమయ్యారు. సీమలో సాగు విస్తీర్ణం తక్కువ గా ఉన్న ప్రాంతాల్లో కాలువల ద్వారా నీటిని మళ్లించి తద్వారా సాగు, తాగు, పరిశ్రమల ప్రోత్సాహకానికి ఒక విజన్‌తో సీఎం చంద్రబాబు పనిచేస్తున్నారు. అందులో భాగంగానే హంద్రీనీవా సుజల స్రవంతి విస్తరణ పనులు చేపట్టి త్వరితగతిన పనులు పూర్తి చేసేం దుకు డెడ్ లైన్ విధించారు. సాగునీటి ప్రాజెక్టులు నిర్మిస్తే సాగు విస్తీర్ణం పెరుగుతుంది. వలసలు తగ్గుముఖం పట్టి రైతాంగానికి మేలు చేకూరడమే కాకుండా స్థానికంగా వ్యవసా య కూలీలకు ఉపాధి లభిస్తుంది. పరిశ్రమలకు తోడ్పాటుగా ఉంటుంది. ఇవన్నీ కనిపిం చని సైకో బ్యాక్ జగన్‌రెడ్డి మెప్పు కోసం మాట్లాడుతున్నారు తప్పితే... వారి మాటల్లో నిజం 1 పర్సెంట్ కూడా లేదని వాళ్ళకి తెలుసు. 2014-2019 మధ్య కాలంలో రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టుల కోసం ఖర్చు పెట్టింది ఎంత... జగన్ రెడ్డి ఐదేళ్ల పానలో చేసింది ఎంతా అని లెక్కలు వేసుకుంటే వాళ్లకే తెలుస్తుంది. మంచి చేసింది చంద్రన్న అయితే... సీమ ప్రజలను ముంచేసింది జగన్ అని. ఎక్కడ ఏ మంచి పని మొదలు పెట్టినా... దాన్ని దెబ్బతీసేందుకు రాబంధుల్లా వాలిపోయే వైసీపీ నేతలకు... ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పుతో కూడా ఇంకా బుద్ధి రాలేదు. అధికారంలోకి వచ్చిన 11 నెలల్లోనే సీఎం చంద్రబాబు ఇంత అభివృద్ధి చేస్తుంటే చూడలేకపోతున్న వైసీపీ నేతలు కళ్లున్న కబోధుల్లా విమర్శలకు దిగుతున్నారు. ఇది వారి దిగజారుడు తనానికి నిదర్శనం.

## రాష్ట్రమంతా సిరుల జరులు

కరవు నేలపై సాగును వృద్ధిలోకి తేవాలనే సంకల్పంతో నాడు అన్న ఎన్టీఆర్ తెలుగు గంగ, హంద్రీ నీవా సుజల స్రవంతి, గాలేరు నగరి వంటి ప్రాజెక్ట్‌లకు శ్రీకారం చుడి తే... నేడు చందన్న ఆ ప్రాజెక్టులకు అధిక నిధులు కేటాయించి పనులు పూర్తి చేశారు. సీమలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలనే సంకల్పంతో వలసలు నివారించాలనే ధ్యేయంగా పనిచేస్తున్నారు. అందుకు అనుగుణంగా ప్రస్తుతం రాయలసీమలోని అన్ని జిల్లాల్లో సాగునీటి ప్రాజెక్టుల పనులు కూటమి ప్రభుత్వం వచ్చాక ఊపందుకున్నాయి. రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులు గత 11 నెలలుగా పరుగులు పెడుతున్నాయి. తెలుగు వారి జీవనాడి అయిన పోలవరం పనులు ఐదేళ్ల తర్వాత సీఎం చంద్రబాబు ఇప్పటికే పనులు ప్రారంభించారు. 2027 నాటికి పూర్తి చేసేలా షెడ్యూల్ కూడా విడుదల చేశారు. అలాగే పోలవరం ప్రాజెక్ట్ ను పరుగులు పెట్టిస్తూనే వెనకబడిన ప్రాంతాలైన రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాజెక్టులకు ఊపిరిపోస్తున్నారు. 2025-2026 ఆర్థిక బడ్జెట్ లో జలవనరు శాఖకు రూ.18,019 కోట్లు అత్యధికంగా నిధులు కేటాయించారు. నీటి ప్రాజెక్టులు వేగంగా పూర్తిగా చేసేందుకు చంద్రబాబు కృషి చేస్తున్నారు. అలాగే వరదల సమయంలో సముద్రంలో ఏటా వృథాగా పోతున్న వేల టీఎంసీల నీటి నుంచి 200 టీఎంసీల నీటిని రాయలసీమ ప్రాంతానికి తరలించి కరువు రహిత సీమగా మార్చేం దుకు కృతనిశ్చయంతో సీఎం చంద్రబాబు వడివడిగా పరుగులు పెడుతున్నారు. ఇప్పటికే గోదావరి బనకచర్ల ప్రాజెక్ట్‌కు సంబంధించి ప్రత్యేకమైన కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ ప్రాజెక్ట్ పూర్తికి కేంద్రం నుంచి సహకారం కావాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాశారు. అటు తెలంగాణ ప్రభుత్వం అడ్డుకునే ప్రయత్నాల ను చాణిక్యంతో తిప్పికొడుతూ ప్రాజెక్ట్ అవశ్యకతను వివరిస్తూ... రాయలసీమను సస్య శ్యామలం చేసే దిశగా మన చంద్రన్న అడుగులు వేస్తున్నారు.

## సీమ ప్రాజెక్టులకు అత్యధిక నిధులు కేటాయించిన ఘనత చంద్రన్నదే

విభజన అనంతరం సీఎం చంద్రబాబు ప్రభుత్వం 2014-19 ఐదేళ్ల కాలంలో రాయలసీమ ప్రాజెక్టులపై రూ.12,441 కోట్లు ఖర్చు చేసింది. చంద్రబాబు అధికారంలో ఉంటే రాయలసీమకు పండగే అన్న రీతిలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పైపుల ద్వారా కృష్ణా జలాలను మద్రాసుకు తరలించాలని ఆనాడు తమిళనాడు ప్రయత్నిస్తే దాన్ని ఎన్టీఆర్ వ్యతిరేకించారు. రాయలసీమ గడ్డపై తెలుగుగంగ ప్రాజెక్టు చేపట్టారు. పోతిరెడ్డిపాడు ప్రాజెక్టును నిర్మించారు. ఎన్టీఆర్ ప్రారంభించి.. చంద్రన్న అభివృద్ధి చేసిన తెలుగు గంగ, హంద్రీ-నీవా, గాలేరు-నగరి, సోమశిల, స్వర్ణముఖి ప్రాజెక్టులు ఈనాడు రాయలసీమకు వరప్రసాదాలయ్యాయి. గాలేరు-నగరికి చంద్రబాబు రూ.1,546.26 కోట్లు ఖర్చు చేశారు. హంద్రీ-నీవాకు రూ.4,182 కోట్లు ఖర్చు చేసింది.

## జగన్ ఐదేళ్ల పాలనలో అధ్వాన్నంగా సీమ ప్రాజెక్టులు

విధ్వంసమే అజెండాగా ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టిన జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసానికి తెరతీశాడు. రాయలసీమను రతనాల సీమగా మార్చేందుకు చంద్రబాబు నాయుడు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తే... ఏడారి మార్చి రాయలసీమ వాసులకు తీరని నష్టం చేకూర్చాడు. ఎన్నికల ముందు జలయజ్ఞాన్ని పూర్తి చేస్తామని, పోలవరం, వెలిగొండ సహా అన్ని ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన నిర్మిస్తామ, రక్షిత మంచినీరు %-% సాగు నీరు కల నిజం చేస్తామని, చెరువులను పునరుద్దరిస్తాం, జలకళను తీసుకోస్తామని కల్లబొల్లి హామీలను 2019 ఎన్నికల ముందు జగన్ రెడ్డి గుప్పించారు. కాని అధికారంలోకి వచ్చిన రోజు నుంచే ఐదేళ్ల కాలంలో ఏందయ్యా చేసింది అంటే గుండు సున్నా. నీటి ప్రాజెక్టులు కొట్టుకుపోయి ప్రజలు చనిపోయినా పట్టిన జగన్ రెడ్డి... తన ఐదేళ్ల పాలనలో జలవనరుల రంగాన్ని పూర్తిగా నాశనం చేశాడు. టీడీపీ ఐదేళ్లలో జలవనరుల రంగంలో రూ.68,293.94 కోట్ల వ్యయంతో రాష్ట్ర వ్యాప్తంగా 62 ప్రాజెక్టులను చేపట్టి, 23 ప్రాజెక్టులను పూర్తి చేసింది. 32.02 లక్షల ఎకరాలకు ఆయకట్టు స్థిరీకరణ, 7 లక్షల ఎకరాలకు నూతన ఆయకట్టు అందించింది. కానీ జగన్ ప్రభుత్వం రూ.32,998.05 కోట్లు ఖర్చు చేసి ఒక్క ప్రాజెక్టును పూర్తి చేయలేదు. ఒక్క ఎకరాకు సాగునీరందించలేదు. పైగా రూ.10 వేల కోట్లు బకాయిలు పెట్టి వెళ్లాడు. రివర్స్ టెండరింగ్ పేరుతో కాలయాపన చేసి కాంట్రాక్టర్లను మార్చి కమీషన్లు దండుకుంటున్నారు. 5 ఏళ్లుగా రాయలసీమలో ప్రగతి, అభివృద్ధి లేదు, ప్రాజెక్టుల నిర్మాణం ఊసే లేదు, వలసలు పెరిగిపోయాయి. రాయలసీమ ప్రాజె క్టులకు జగన్‌కేవలం రూ.2,011.13 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. విభజన చట్టం 11వ షెడ్యూల్డ్‌లో హంద్రీ నీవా,గాలేరు నగరిని పొందుపరిచారు. అయి నా కేంద్ర జలశక్తి కమిషన్ నాన్ అప్రూడ్ ప్రాజెక్టులు గా జాబితాలో పేర్కొన్నా జగన్ రెడ్డి నోరెత్తకపోవడం సిగ్గుచేటు. టీడీపీ ప్రభుత్వంలో ప్రారంభించిన ముచ్చు మర్రి ఆర్డీఎస్, గుండ్రేవుల, వేదవతి, గాలేరు-నగరి, హంద్రీ-నీవా కాలువల సామర్థ్యం పెంపునకు జగన్ హయాంలో తగు స్థాయిలో నిధులు విడుదల చేయ లేదు. గాలేరు-నగరికి చంద్రబాబు రూ.1,546.26 కోట్లు ఖర్చు చేయగా... జగన్ ఖర్చు చేసింది రూ.443.43 కోట్లు మాత్రమే. హంద్రీ-నీవాకు చంద్రన్న రూ.4,182 కోట్లు ఖర్చు చేయగా... జగన్ రెడ్డి ఖర్చు చేసింది రూ.515.79 కోట్లు మాత్రమే. ఈ ద్రోహాన్ని కప్పి పెట్టుకోవడానికి రాయలసీమ లిఫ్ట పేరుతో జగన్నాటకం ఆడి కృష్ణ, గోదావరి జలాలను కేంద్రానికి ధారాదత్తం చేశారు. రూ.900 కోట్లు అవినీతికి పాల్పడ్డారు.

## 2025 -2026 ఆర్థిక బడ్జెట్‌లో సీమకే ప్రాధాన్యం

జగన్‌రెడ్డి వినాశన పాలన అనంతరం అధికారం లోకి వచ్చిన చంద్రబాబు ప్రభు త్వం రాయలసీమ ప్రాజెక్టులకు అత్యధిక నిధులుకేటాయించారు. 2025 -2026 ఆర్థిక బడ్జెట్‌లో సాగునీటి రంగానికి రూ.18,019 కోట్ల కేటాయించారు. ఇక్కడా రాయల సీమ ప్రాజెక్టులకే అత్యధికంగా కేటాయింపులు చేశా రు. కర్నాటక, తెలంగాణ ప్రభుత్వాలతో సంప్రదిం పులు జరిపి గోదావరి-బనకచర్ల ప్రాజెక్ట్ ఆమోదానికి ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకుంటోంది. గోదావరి వరదల జలాలను రాయలసీమకు తరలించి రాయలసీమను కోనసీమగా మార్చేలా సీఎం చంద్రబాబు ప్రణాళికలు రచిస్తున్నారు.

## వైసీపీ నేతలు కళ్లున్న కబోధులు

వెనకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల పూర్తికి సీఎం చంద్రబాబు అను నిత్యం ఆరాటపడు తుంటే.. వైసీపీ నేతలు మాత్రం మీడియా ముందు కొచ్చి సిగ్గులేని విమర్శలు చేస్తున్నారు. రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల కోసం చంద్రబాబు ప్రభు త్వం రూ.వేల కోట్ల నిధులు కేటాయించి ఖర్చు చేస్తున్నా కళ్లున్న కబోధుల్లా రాయల సీమకు చెందిన వైసీపీ నేతలు వ్యవహరిస్తున్నారు. రాయలసీమ ప్రాజెక్ట్‌ల కోసం జగన్‌రెడ్డి ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో ఏం చేసిందో చెప్పే దమ్ములేదు కానీ.. కోట్లు ఖర్చు చేస్తున్న కూటమి ప్రభుత్వంపై చిందులు తొక్కడం వారి అజ్ఞానానికి నిదర్శనం. ఏ ప్రభుత్వం ఏమి చేసిందో తెలుసు కాబట్టే సీమ ప్రజలు జగన్‌రెడ్డికి గత ఎన్నికల్లో కర్ర కాల్చి వాతపెట్టారన్న సంగతి వైసీపీ నేతలు గుర్తుపెట్టుకుంటే మంచిది.

## జూలై 10 డెడ్‌లైన్..

హంద్రీ-నీవా సుజల స్రవంతి ద్వారా ఈ ఏడాది జూలై 10న నీటిని విడుదల చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ పథకం ఫేజ్-1, 2 కింద 554కిలోమీటర్ల మేర కాలువ విస్తరణ, లైనింగ్ పనులకు రూ.3,873 కోట్లు ఖర్చు చేస్తున్నారు. త్వరి తగతిన పూర్తిచేసేలా అధికారులు శ్రద్ధపెట్టారు. జూలై 10నాటికి నీటి విడుదలకు సమాయత్తం అయ్యేలా పనులు వేగంగా జరుగుతున్నాయి. హంద్రీ-నీవా, పోలవరం-బనకచర్ల పథకాలు పూర్తయితే రాయల సీమలో కరవు మాటేవినిపించదు. హంద్రీ-నీవా, గాలేరు -నగరి, తెలుగు గంగ ప్రాజెక్టులకు రూపకల్ప న చేసి రాయలసీమ దశ..దిశ మార్చిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుంది. నేడు గొల్ల పల్లి ప్రాజెక్టుపూర్తి చేసి నీళ్లిచ్చింది..కియా కం పెనీని జిల్లాకు తీసు కొచ్చినఘనత టీడీపీదే. ఇకనైనా వైసీపీ నేతలు రాజకీయ విమర్శలు మాని వాస్తవాలు తెలు సుకుని ప్రభుత్వంచేస్తు న్న అభివృద్ధి కార్యక్ర మాలను స్వాగతిస్తే మంచిది.

- ప్రవీణ్ బోయ,
అనలిస్ట్

### 2014 -2019 మధ్య కాలంలో టీడీపీ కేటాయించిన నిధుల వివరాలు

| జిల్లా | ప్రాజెక్ట్ పేరు | వ్యయం (రూ కోట్లలో) | క్షేత్రస్థాయి ప్రయోజకులు (ఎకరాలు) | నూతన ప్రయోజకులు (ఎకరాలు) |
|---|---|---|---|---|
| చిత్తూరు | అశ్విన్ క్యానల్ | రూ.452 | 1,600 | - |
| | అక్సిలరీ జలాశయం | రూ.218 | 80,000 | - |
| అనంతపురం | టీబీపీ హైలెవెల్ కెనాల్ | రూ.310 | - | - |
| | బిడిపి హై లెవెల్ కెనాల్/ఎక్స్‌టెన్షన్ | రూ.124 | - | - |
| | మారుమూల ట్యాంక్స్ | రూ.40 | 18,000 | - |
| | మదకశిర బ్రాంచ్ కెనాల్ | రూ.806 | 32,770 | 10,000 |
| కడప | గండికోట రిజర్వాయర్ | రూ.1,744 | - | - |
| | నె. ప్రాజెక్ట్ రిడిజైన్ | రూ.755 | - | - (రాయలసీమ నుంచి రీడైజన్) |
| కర్నూలు | ముచ్చుమర్రి లిఫ్ట్ ఇరిగేషన్ | రూ.549 | 88,919 | - |
| | సురమాల లిఫ్ట్ ఇరిగేషన్ | రూ.118 | 1,000 | 20,300 |
| | ప్రొద్దుటూరు లిఫ్ట్ ఇరిగేషన్ | రూ.294 | 26,400 | - |

### ప్రాజెక్టుల వారీగా ఖర్చు - ప్రతిపాదిత నిధుల పట్టిక (2025 - 2026)

| జిల్లా | ప్రాజెక్ట్ పేరు | గతంలో ఖర్చు (రూ.కోట్లు) | ప్రతిపాదిత నిధులు (రూ.కోట్లు) |
|---|---|---|---|
| - | తెలుగుగంగ ప్రాజెక్ట్ | రూ.406.46 | రూ.840.30 |
| - | హంద్రీ-నీవా సుజల స్రవంతి | రూ.1,586.18 | రూ.3,243.64 |
| కడప | గాలేరు-నగరి | - | రూ.488.57 |
| కడప | పులివెందుల కెనాల్ స్కీం | - | రూ.170.69 |
| కడప | మైలవరం కెనాల్ | - | రూ.4.25 |
| అనంతపురం | తుంగభద్ర హెచ్‌ఎల్సీ స్టేజ్ 1 | - | రూ.37.00 |
| అనంతపురం | తుంగభద్ర హెచ్‌ఎల్సీ స్టేజ్ 2 | - | రూ.3.23 |
| కర్నూలు | తుంగభద్ర ఎల్‌ఎల్సీ | - | రూ.32.00 |
| కర్నూలు | కెసీ కెనాల్ | - | రూ.183.89 |
| కర్నూలు | ఎస్‌ఆర్ విభాగం- తెలుగు బీసీ | - | రూ.9.02 |
| కర్నూలు | గురురాఘవేంద్ర ప్రాజెక్ట్ | - | రూ.34.06 |
| కర్నూలు | గాజులదిన్నె | - | రూ.11.98 |
| కర్నూలు | 68 తాగునీటి చెరువుల అభివృద్ధి | - | రూ.37.00 |
| | గుండ్రేవుల ప్రాజెక్ట్ (డీపీఆర్ సిద్ధం) | అంచనా ఖర్చు | రూ.4,530.00 (అంచనా) |

చైతన్యరథం

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో జన ఔషధి దుకాణాలు

అమరావతి (చైతన్యరథం): పెద్దసంఖ్యలో ప్రభుత్వ ఆసుపత్రులకొచ్చే రోగుల ప్రయోజనార్థం నాణ్యమైన జనరిక్ మందులను అతి తక్కువ ధరలకే అందించ డానికి అన్ని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల్లో జన ఔషధి కేంద్రాలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విషయంపై సమీక్షానంతరం ఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ నిర్ణయం తీసుకున్నారు. జీజీహెచ్‌లలో ప్రస్తుతం జనరిక్ మెడికల్ షాపుల నిర్వాహకులు కొన్ని సందర్భాల్లో 50 నుంచి 600 శాతం మేరకు లాభాలతో ఈ మందులను విక్రయిస్తున్నారు. ప్రస్తుతం 16 జీజీహెచ్‌లలో 23 ప్రైవేట్ జనరిక్ మెడిసిన్ స్టోర్లు ఉన్నాయి. నంద్యాల జీజీహెచ్‌లో మాత్రం ఇలాంటి స్టోర్ లేదు. ప్రభు త్వాసుపత్రుల్లో జనరిక్ మందుల షాపులు నిర్వహించడానికి లాభాపేక్షలేని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతిపాదనకు మంత్రి ఆమోదం తెలిపారు.

- తక్కువ ధరకు నాణ్యమైన జనరిక్ మందులు
- ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహణ
- ఏరియా, జిల్లా ఆసుపత్రుల్లోనూ ఏర్పాటుకు చర్యలు
- వైద్యఆరోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశం




### ప్రస్తుత వ్యవస్థలో లోపాలు

జనరిక్ మందుల తయారీ, వాటి ధరలను నిర్ణయించడంలో లోపాలను ఉపయో గించుకుని ప్రస్తుతం అమ్మకందారులు భారీ లాభాలతో రోగులకు అధిక ధరలకు విక్ర యిస్తున్నారు. ప్రస్తుతం 16 జీజీహెచ్‌లలో పనిచేస్తున్న జనరిక్ మెడిసిన్ రిటైలర్లు జనరిక్ ఔషధాల తయారీ, ధరల నిర్ణాయక విధానంలోని లొసుగులను ఉపయోగించుకుంటూ రోగులను దోపిడీ చేస్తున్నారు. దీనికి తోడు ఈ వ్యవస్థపై తగిన నియం త్రణ లేకపోవటం వారికి అనుకూలంగా మారింది. జనరిక్ ఔషధాల తయారీదారులు తమ ఉత్పత్తులపై అధిక ఎంఆర్‌పీ (గరిష్ఠ రిటైల్ ధర)ని ముద్రించి సరఫరా చేయ డాన్ని అమ్మకందారులు స్వంత ప్రయోజనాలకు వాడుకుంటున్నారు. దీంతో రిటైలర్లు వివిధ మందులపై వివిధ ప్రదేశాలలో తమ ఇష్టానుసారం డిస్కౌంట్లను అందిస్తున్నారు. ఈ ప్రక్రియలో వారు 50% నుంచి 600% వరకు భారీ లాభాలను ఆర్జిస్తున్నారు. అంతేకాక వారు అవ సరమైన జనరిక్ ఔషధాలలో కేవలం 30% నుంచి 40% వరకు మాత్రమే అందుబాటులో ఉంచుతున్నారు. అధిక లాభార్జనను నిరోధించడంతో పాటు ప్రిస్క్రిప్షన్ లేకుండా మందుల అమ్మకాలను నిరోధించే తప్పనిసరి బిల్లింగ్ వ్యవస్థ అమలులో లేదు. అటువంటి జనరిక్ ఔషధాల నాణ్యత విషయంలో నియంత్రణ లేకపోవటం కూడా ఆందోళన కలిగించే మరో అంశం. ప్రస్తుతం ఉన్న 23 జనరిక్ దుకాణాలను స్వయం సహాయక బృందాలు, ఇతర సంఘాలకు కేటాయించినప్పటికీ, ప్రైవేట్ వ్యక్తులు వాటిని భారీ లాభాలతో నడుపుతున్నట్లు తెలుస్తోంది.

### జన ఔషధి ప్రయోజనాలు

ప్రస్తుత వ్యవస్థలోని లోపాలను పరిష్కరించి దేశవ్యాప్తంగా రోగులకు సరసమైన ధరలకు నాణ్యమైన జనరిక్ ఔషధాలను సరఫరా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 'ప్రధాన మంత్రి- భారతీయ జన ఔషధి పరియోజన' (పీఎం-బీజేపీ)ని ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద భారత ప్రభుత్వ ఔషధాల శాఖ జన ఔషధి దుకాణాలకు సరఫరా చేయడా నికి ముద్రించిన ప్రామాణిక గరిష్ఠ విక్రయ ధరతో జనరిక్ ఔషధాలను కొనుగోలు చేస్తుంది. వీటిని 15% లాభ మార్జిన్‌తో మాత్రమే జన ఔషధి కేంద్రాలు విక్రయిస్తా యి. ఇది రోగులకు భారీగా ప్రయోజనం చేకూరుస్తుంది. ప్రతి అమ్మకాన్ని కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి చేసిన ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేయాలి. తద్వారా రిటైలర్లు జనరిక్ ఔషధాల అమ్మకపు ధరలను మార్చటానికి వీలుండదు. చాలా అరుదైన సందర్భాలలో తప్ప జన ఔషధి దుకాణదారులు ఖరీదైన బ్రాండెడ్ మందులను విక్ర యించరు. సంబంధిత అధికారుల ఆమోదంతో కొన్ని వ్యాధులకు జనరిక్ మందులు అందుబాటులో లేనప్పుడు మాత్రమే బ్రాండెడ్ మందులను విక్రయి స్తారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల్లో ప్రవేశపెట్టబోయే ఈ జన ఔషధి కేంద్రాలకు సంబంధించి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తగు అనుమతులు పొందాల్సి ఉంటుంది. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా స్థాయి బ్రాంచ్‌లకు కలెక్టర్లు చైర్మన్లుగా ఉంటారు. సెకండరీ ఆసుపత్రుల్లో కూడా జన ఔషధి కేంద్రాలు ప్రవేశపెట్టాలని మంత్రి సత్యకుమార్ ఆదేశించారు. 17 ప్రభుత్వ జనరల్ ఆసుపత్రులలో జన ఔషధి కేంద్రాలు ప్రవేశపెట్టా లనే ప్రతిపాదనను ఆమోదించారు. రోగులకు కలిగే ప్రయోజనాలను దృష్టిలో ఉంచు కుని ఏరియా, జిల్లా ఆసుపత్రులలో కూడా వాటిని నిర్వహించే అవకాశాన్ని పరిశీలిం చాలని అధికారులను ఆదేశించారు. జన ఔషధి కేంద్రాలను దేశవ్యాప్తంగా నెలకొల్పా లని ప్రధాని మోదీ సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు.

# చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు చర్యలు భేష్

- గెయిల్ సహకారం అభినందనీయం
- పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్
- 'చిన్నారి ఆరోగ్యం' కార్యక్రమం ప్రారంభం
- పోషకాహార లోపం నివారణ దిశగా చర్యలు





రాజమండ్రి (చైతన్యరథం): పోషకాహార లోపం, ఆర్థికపరమైన ఇబ్బందులు, తల్లిదం డ్రుల్లో సరైన అవగాహన లేమి, బలవర్ధకమైన ఆహారం అందకపోవడం తదితర కారణా లతో సరైన రీతిలో ఎదగని చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యం కోసం "చిన్నారి ఆరోగ్యం" కార్యక్రమం రూపొందించడం శు భపరిణామమని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. శనివారం రాజమహేంద్రవరం శ్రీ వెంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో గెయిల్ లిమిటెడ్ కంపెనీ వారి కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో ఏర్పాటు చేసిన "చిన్నా రి ఆరోగ్యం" కార్యక్రమ ప్రారంభోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. చిన్నారి ఆరోగ్యం పోస్టర్‌ను ఆవిష్కరించారు. అంగన్‌వాడీ ద్వారా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సం దర్శించి అక్కడి పదార్థాలను రుచి చూశారు. అనంతరం ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనున్న జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అధికారి కె.విజయకుమారిని సన్మానించారు. బాలిం తలకు శ్రీమంతం, చిన్నారులకు గ్రాడ్యుయేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తొలిసారిగా తూర్పుగోదావరి జిల్లాలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం రాష్ట్రానికే ఆదర్శంగా నిలవాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలు రాష్ట్రంలో అన్ని చోట్లా జరగాలని ఆకాంక్షించారు. తూర్పుగోదావరి జిల్లాలో 6 నెలల వయసు నుంచి ఆరేళ్ల వయసు గల దాదాపు 74,238 మంది చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యానికి కృషి చేయడం సంతోషకరమని పేర్కొన్నారు. అందులో 1438 మంది చిన్నారులు ఇతరత్రా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని వారి కోసం "చిన్నారి ఆరోగ్యం" పేరుతో ఒక కార్యక్ర మం ఏర్పాటు చేసి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి సామాజిక బాధ్యతతో ఆయా చిన్నారులను పోషకాహార లోపం నుంచి సంపూర్ణ పోషణ వైపునకు నడిపించేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసిన ప్రతిఒక్కరిని ప్రశంసించారు. చిన్నారులను పోషకా హార లోపం నుంచి సంపూర్ణ పోషణ వైపునకు నడిపిస్తూ రాష్ట్రంలోనే తూర్పుగోదావరిని ఆదర్శ జిల్లాగా నిలబెట్టేందుకు ప్రయత్నం చేస్తున్న కలెక్టర్ పి.ప్రశాంతిని ప్రత్యేకంగా అభినందించారు. సామాజిక బాధ్యతగా ముందుకువచ్చిన గెయిల్ యాజమాన్యాన్ని ప్రశంసించారు. ప్రత్యేక పోషకాహార విలువలున్న ఆహార కిట్‌ను ప్రతినెలా చిన్నారులకు అందజేయాలన్న గెయిల్ యాజమాన్యం ఉద్దేశం మంచిదన్నారు. బాలమిత్రల ద్వారా చిన్నారుల డేటాను రూపొందించడం తద్వారా సమగ్ర కార్యక్రమంగా రూపొందించడం అభినందనీయమన్నారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖను ఇందులో భాగస్వామ్యం చెయ్యాలనే లక్ష్యం దిశగా అడుగులు వేస్తున్నట్లు చెప్పారు. గతం లో జిల్లాలో విజయవంతంగా చేపట్టిన బంగారు కొండ కార్యక్రమాన్ని మరింత సమర్థ వంతంగా అమలు చేయాలనే ఉద్దేశంతో "చిన్నారి ఆరోగ్యం" కార్యక్రమం రూపకల్పన చేస్తున్నట్లు తెలిపారు. పోషకాహార లోప పిల్లల తో పాటుగా క్షయ, హెచ్ఐవీ పాజిటివ్, సికిల్ సెల్ అనీమియా, తలసేమియా తదితర వ్యాధులతో బాధపడుతున్న పిల్లలకు కూడా "చిన్నారి ఆరోగ్యం" కిట్లు అందించనున్నట్లు తెలిపారు. జిల్లాలో 1448 అతి తీవ్ర పోష కాహార లోపం ఉన్న పిల్లలు, 95 మంది తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న పిల్ల లను గుర్తించి చిన్నారి ఆరోగ్యం పిల్లలతో వారిని మ్యాపింగ్ చేయడం జరిగిందన్నారు. బాల మిత్రలు ప్రతి బుధవారం చిన్నారి ఆరోగ్యం పిల్లలను సందర్శించి వారి ఎత్తు, బరువు, ఆరోగ్యస్థితిని పరీక్షించి ఆ వివరాలు చిన్నారి ఆరోగ్యం యాప్‌లో అప్లోడ్ చేస్తారు. నెలకు ఒకసారి పోషకాహారం కిట్స్ పంపిణీ చేయడం, వారి ఆరోగ్య వివరాలు అప్లోడ్ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. గెయిల్ ప్రతినిధులు జనరల్ మేనేజర్ వై.ఎ.కుమార్ మాట్లాడుతూ చిన్నారులకు సంపూర్ణ పోషణ కూడిన ఆహారం అందచేసే ప్రక్రియలో గెయిల్ సంస్థ ద్వారా రూ.38 లక్షల ఆర్థిక చేయూత అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అధికారి కె.విజయకుమారి, గెయిల్ ప్రతినిధులు డిప్యూటీ జనరల్ మేనేజర్ (హెచ్ఆర్) దీవి ప్రభాకర్, డీజీఎం కె.రాజన్, అమరావతి సొల్యూషన్స్ అనిల్‌కుమార్, డీఎంహెచ్‌వో కె.వెంకటేశ్వరరావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో ఎన్.వసుంధర, ఆర్ఎంసీ, ఐ సీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

# గిరిజనుల పేరుతో భూ కబ్జాకు యత్నం

- పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం
- చర్యలు తీసుకోవాలని ప్రజావినతుల్లో ఫిర్యాదు
- అర్జీలు స్వీకరించిన కిడారి, డేగల ప్రభాకర్









మంగళగిరి (చైతన్యరథం): టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో అర్జీదారులు వినతులు అందజేశారు. మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్, ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్ వినతులు స్వీకరించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

తమకు పిత్రార్జితంగా తాతల నుంచి వచ్చిన ఆస్తిని గిరిజనుల పేరుతో ఆక్రమించుకోవాలని పలువురు ప్రయత్నిస్తున్నారని ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం మండలం దొరమామిడి గ్రామానికి చెందిన యర్రాప్రగడ సత్యనారాయణ ఫిర్యాదు చేశారు. వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని వాపోయాడు.

తాము ఇల్లు నిర్మించుకునేందుకు అడ్డుగా ఉన్న కరెంట్ స్థంభాలను తొలగించ మంటే అధికారులు లంచం అడుగుతున్నారని కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మైనార్టీ కాలనీకి చెందిన షేక్ షమీనా ఫిర్యాదు చేశారు. దయచేసి తమ స్థలంలో ఉన్న కరెం ట్ స్తంభాలను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

తన సోదరులు తనకు రావాల్సిన వాటా ఇవ్వకుండా అక్రమంగా అనుభవి స్తున్నారని తిరుపతి జిల్లా తిరుపతి మండలం ఎం.ఎం.మెట్టమీదకండ్రిగ గ్రామానికి చెందిన టి.వాణి వినతిపత్రం అందజేశారు. తనకు న్యాయం చేసి వాటా ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.

తన భర్త గుండెపోటుతో మరణించాడని.. డిగ్రీ చదువుకున్న తన పిల్లలకు ఏదైనా ఉద్యోగం ఇప్పించి ఆదుకోవాలని తిరుపతి జిల్లా చంద్రగిరి మండలానికి చెందిన జి.నిర్మల అభ్యర్థించారు.

తనకు ఉండేందుకు ఇల్లు లేక దేవాలయంలో ఉంటున్నానని.. తనకు ఇంటిని మంజూరు చేయాలని ప్రకాశం జిల్లా తర్లుపాడు మండలం జగన్నాథపురానికి చెందిన ముక్కర ముత్తయ్య వినతిపత్రం అందజేశారు.

గతంలో వచ్చిన తుఫాన్ల కారణంగా తమ గ్రామంలో చెక్‌డ్యామ్‌లు కొట్టుకు పోయి పంటలకు నీటి సమస్య తీవ్రమైందని శ్రీకాకుళం జిల్లా కొత్తూరు గ్రామానికి చెందిన ఎన్.తులసీధరరావు తెలిపారు. చెక్‌డ్యామ్‌లను నిర్మించి సాగునీటి సమస్య పరిష్కరించా లని విజ్ఞప్తి చేశారు.

# రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నారా?




కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న పేదలకు కూటమి ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. సచివాలయాల ద్వారా పౌరసరఫరాల శాఖకు సంబంధించిన ఏడు రకాల రేషన్ కార్డుల సేవలను ఈ నెల 7నుంచి ప్రారంభించింది. గ్రామీణంలో రూ.లక్ష, పట్టణ, నగర ప్రాంతాల్లో రూ. 1.20 లక్షల వార్షిక ఆదాయం ఉన్నవారంతా అర్హులని అధికారులు పేర్కొన్నారు. గత సర్కార్‌లో కొత్త కార్డులు అరకొరగా పంపిణీ చేసి సరి పెట్టేసింది. పైగా కొత్త కార్డులు తీసుకోవడానికి పలు రకాల షరతులు విధించింది. వీటన్నిటినీ పరిగణనలోకి తీసుకున్న కూటమి ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా సులభంగా రేషన్ కార్డులు, కార్డులో సభ్యుల చేర్పులు, మార్పులకు అవకాశం కల్పించింది. అర్జీ చేసుకున్న వారికి జూన్‌లో కొత్త కార్డులు పంపిణీ చేయనున్నారు. తిరుపతి జిల్లాలో అర్హత కలిగిన పేదవారు కొత్త రేషన్‌కార్డుకు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శేషాచలం రాజు పేర్కొన్నారు. కార్డులో సవరణలు చేసుకోవచ్చని ఆయన చెప్పారు.

**క్యూఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్ కార్డులు :**

కూటమి ప్రభుత్వం అర్హులైన వారికి క్యూఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్ కార్డులు అందించనుంది. దాన్ని స్కాన్ చేస్తే కుటుంబంలో ఉండే సభ్యులతో పాటు గత ఆరు నెలలుగా తీసుకున్న సరకుల వివరాలు తెలుస్తాయి. అదేవిధంగా దేశంలో ఎక్కడైనా రేషన్ తీసుకునేలా ఈ కార్డు వెసులుబాటు కల్పిస్తుంది. మరోవైపు పౌరసరఫరాల వ్యవస్థను పునర్వ్యవస్థీకరించాలని అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశాలిచ్చారు. ప్రజల సంతృప్తే పరమావధిగా తీర్చిదిద్దాలని తెలిపారు. మే 15 నుంచి వాట్సప్ గవర్నన్స్ ద్వారా రేషన్ దరఖాస్తుల స్వీకరించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

# తెలుగు రాష్ట్రాలతో దోబూచులాడుకుంటున్న వాతావరణం

● అటు ఎండలు... ఇటు వర్షాలు...



తెలుగు రాష్ట్రాల్లో భిన్న వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నాయి. పగలు ఎండలు, సాయంత్రం వేళ వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో వాతావరణ శాఖ కీలక ప్రకటన చేసింది. ద్రోణి ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రెండు రోజుల పాటు అక్కడక్కడ తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. అంతేకాకుండా ఎండలు కూడా దారెత్తిస్తాయని వాతవరణ శాఖ పేర్కొంది. ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతాయని పేర్కొంది.. ఆంధ్రప్రదేశ్‌లో 41- 43.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ వెల్లడించారు. అల్లూరి సీతారామరాజు- 11, అనకాపల్లి జిల్లా-8 మండలాల్లో తీవ్రవడగాలులు(19), మరో 30 మండలాల్లో వడగాలులు ప్రభావం చూపే అవకాశం ఉన్నట్లు తెలిపారు. సోమవారం 24 మండలాల్లో తీవ్ర,57 మండలాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందన్నారు. ఆదివారం అల్లూరి సీతారామరాజు-8, అనకాపల్లి-16, అనంతపురం-4, అన్నమయ్య-1, చిత్తూరు జిల్లా కుప్పం మండలాల్లో(30) వడగాలులు వీచే అవకాశం ఉందన్నారు. శనివారం తిరుపతి జిల్లా రేణిగుంటలో 41.7, విజయనగరంలో 41.1,తూర్పుగోదావరి జిల్లా మురమండలో 41, అన్నమయ్య జిల్లా కంబాలకుంటలో 40.8, వైఎస్సార్ జిల్లా మద్దూరు,ప్రకాశం జిల్లా మేకలవారిపల్లిలో 40.7 చొప్పున అధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్లు తెలిపారు. ఎండలో బయటకు వెళ్లేప్పుడు నెత్తికి టోపీ పెట్టుకోండి లేదా రూమాలు కట్టుకోండి, తెలుపురంగు గల కాటన్ వస్త్రాలను ధరించండి. అదేవిధంగా మీ కళ్ళ రక్షణ కోసం సన్ గ్లాసెస్ ఉపయోగించండి. చెవుల్లోకి వేడిగాలి వెళ్ళకుండా జాగ్రత్త పడాలి. గుండె సంబంధిత వ్యాధులు, షుగర్, బీపీ ఉన్నవారు ఎండలో తిరగరాదని సూచించారు. మరోవైపు పిడుగులతో కూడిన ఆకస్మిక వర్షాలు, ఈదురుగాలులు పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు హోర్డింగ్స్, చెట్ల క్రింద, శిథిలావస్థలో ఉన్న గోడలు, భవనాలు దగ్గర నిలబడరాదన్నారు.

# ఎంఎస్ఎంఈలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత : ఎంపీ కలిశెట్టి

●విజయనగరంలో రూ. 7 కోట్లతో ఎంఎస్ఎంఈ యూనిట్‌కు శంకుస్థాపన




విజయనగరం (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం ఎంఎస్ఎంఈ (మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్)లకు అధిక ప్రాధాన్యత కల్పిస్తుందని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు వ్యాఖ్యానించారు. ఎంఎస్ఎంఈలను పెద్దఎత్తున ప్రోత్సహించడంతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఈ మేరకు శనివారం విజయనగరం జిల్లా, రామభద్రపురం మండలం, కొట్టక్కి గ్రామంలో రూ. 7 కోట్లతో 104 ఎకరాల్లో నిర్మించనున్న ఎంఎస్ఎంఈ పార్క్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ... రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో ఎంఎస్ఎంఈలు కీలకపాత్ర పోషిస్తాయని, ఇవి స్థానిక ఉపాధి అవకాశాలను సృష్టించడంతో పాటు, గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో ఆర్థిక అసమానతలను తగ్గిస్తాయన్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఉత్పాదకత సాధించే ఈ పరిశ్రమలు యువతకు ఉద్యోగాలు, మహిళలకు ఆర్థిక స్వావలంబన, సమాజంలో సమతుల్య అభివృద్ధిని అందిస్తాయన్నారు. వలసలు వెళ్లే రోజులు నుండి మన జిల్లాలకి ప్రజలు వలసలు వచ్చే రోజులు వస్తాయని ఎంపీ ధీమా వ్యక్తం చేశారు. ప్రత్యేకంగా ఈ ఎం.ఎస్.ఎం.ఈ పార్క్ ఉత్పత్తులకి ఉపయోగకరంగా మార్కెటింగ్, కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిజేశారు. ఎగుమతులను ప్రోత్సహించడం ద్వారా రాష్ట్ర ఆదాయాన్ని పెంచి, స్వర్ణాంధ్ర లక్ష్య సాధనకు దోహదపడతాయి," అని ఆయన తెలిపారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ఇలాంటి పార్కులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, స్థానిక శాసనసభ్యులు రంగారావు, బొబ్బిలి కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# నేల తల్లి ఆరోగ్యంపై మంత్రి అచ్చెన్న ప్రత్యేక శ్రద్ధ

● ఖరీఫ్‌కు ముందే మట్టి పరీక్షలు చేపట్టేలా ఆదేశాలు జారీ

● గత ప్రభుత్వం భూసార పరీక్షలను విస్మరించింది

● అన్నదాతకు లాభాలు పంట అందించడమే లక్ష్యమని వెల్లడి



గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం పాలనలో భూసార పరీక్షలు పూర్తిగా అటకెక్కాయి. కనీసం మట్టి నమూనా పరీక్షలకు వాడే రసాయనాలు కూడా సరఫరా చేయని దుస్థితి నాటి పాలకులది. కారణంగా మట్టి పరీక్షలు పూర్తిగా వ్యవసాయశాఖ చేపట్టలేకపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిగా కింజరాపు అచ్చెన్నాయుడు బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రైతు ప్రయోజనాల కోసం అనేక నూతన సంస్కరణలు తీసుకువచ్చారు. సాగునీటి రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తూ వస్తున్నారు. అన్నదాతకు లాభాల పంట అందించడమే లక్ష్యంగా పలు కీలక నిర్ణయాలు తీసుకోవడంతో రైతుల కళ్లలో ఆనందం విరజిల్లుతుంది. గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వదిలేసిన మట్టి పరీక్షలు రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున చేపట్టడంతో పాటుగా ఖరీఫ్ సీజన్‌కు ముందే ఈ పరీక్షలు పూర్తిచేసే రైతులకు ఏఏ పంటలు ఏఏ సమయంలో వేసుకోవాలి? ఎంత మేర ఎరువులు ఉపయోగించాలి పంటలకు తగిన నీటి వాడకం వంటి యాజమాన్యంపై అవగాహన కల్పించారు. రైతులకు ఆధునిక వ్యవసాయం పట్ల ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు పెద్దఎత్తున చేపట్టడంతో రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు సాంకేతిక వినియోగంపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. శ్రీకాకుళం జిల్లాలోని 30 మండలాల పరిధిలో 36,520 మట్టి నమూనాలు సేకరించేందుకు జిల్లా వ్యవసాయశాఖ సన్నద్ధమైంది. ఒక్కో మండల పరిధి నుంచి 1200 మండల మట్టి నమూనాలు రైతుల పొలాల్లోంచి సేకరించి భూసార పరీక్ష కేంద్రానికి పంపనున్నారు. ఇప్పటికే జిల్లాలో 22,178 మట్టి నమూనాలు సేరించినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. సేకరించిన నమూనాలు భూసార పరీక్ష కేంద్రం రాగోలులో పరీక్షించి అన్‌లైన్ వాటి వివరాలను పొందుపరుస్తున్నారు. రైతు నేరుగా రైతు భరోసా కేంద్రం నుంచి భూసార పరీక్ష ధృవపత్రాన్ని పొందే వీలు కల్పించారు.

**పోషకాలతో అధిక దిగుబడి**

భూసారం భద్రంగా ఉన్నప్పుడే మొక్క ఎదుగుదల సాధ్యమౌతుంది. తద్వారా నాణ్యమైన దిగుబడులు రైతుకు అందుతుంది. నేల ఆరోగ్యంగా ఉంటేనే ఇది సాధ్యమవుతుంది. భూమిలో ప్రధాన పోషకాలైన, ఉదజని, లవణం, నత్రజని, భాస్వరం, పొటాష్ , లభించే మార్పులను, భూషార పరీక్షల ద్వారా గుర్తించవచ్చును. రసాయన ఎరువులు వాడకం, పెరిగిందని, ఇప్పటికే రాష్ట్ర వ్యవసాయ శాఖ, గుర్తించింది, పంటల సాగుకు, తగిన నిష్పత్తిలో, లేనప్పుడు భూషార పరీక్షల, ఫలితాల మేరకు, పోషకాలు అందించి దిగుబడులు పెంచుకోవచ్చు, నేలనుబట్టి ఐదు ఎకరాల వరకు ఒక నమూనా సేకరించవచ్చు, నమూనాలు తీసే పొలంలో పది నుంచి 20 చోట్ల, మట్టిని సేకరించాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు జిల్లాలో అధిక దిగుబడులు సాధించడానికి అనువైన పరిస్థితులను గతంలో ఎప్పుడు చూసిన సందర్భాలు లేవు. జిల్లాకు చెందిన మంత్రి అచ్చెన్నాయుడు నాయుడు బాధ్యతలు చేపట్టిన తర్వాత రైతు ప్రయోజనాలను కాపాడాలన్న ఆలోచనతో ముందుకు వెళు న్నారు. అందులో భాగంగానే జిల్లాలో రైతు సేవా కేంద్రాల పరిధిలో ఈ ఖరీఫ్ సీజన్ కంటే ముందే నమూనాలను సేకరించాలని వ్యవసాయ శాఖను ఆదేశించారు. ఇప్పటికే మండలాల వారీగా లక్ష్యాలను నిర్దేశించి మట్టి నమూనాల సేకరణ పరీక్షలు చేపట్టడానికి అనువైన పరిస్థితిని కల్పించారు. ల్యాబుల్లో సిబ్బంది ఏర్పాటుతో అవసరమైన రసాయనాలను ప్రభుత్వం ద్వారా ల్యాబ్‌లకు పంపిణీ చేశారు.

# సకాలంలోనే ఈఏడాది ఋతుపవనాలు

రైతులకు భారత వాతావరణ శాఖ గుడ్ న్యూస్ అందించింది. ఈ ఏడాది ఋతుపవనాలు నిర్ణీత సమయం కంటే ముందే రానున్నట్లు తెలిపింది. ఈ నెల 27వ తేదీన నైరుతి ఋతుపవనాలు కేరళను తాకనున్నట్లు ఐఎండీ పేర్కొంది. అలాగే, రానున్న రెండు రోజుల్లో ఏపీలో అన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. అంతేకాదు, ఈ ఏడాది ఋతుపవనాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుందని ఐఎండీ అంచనా వేసింది. రానున్న మూడు రోజులు ఉరుములతో కూడిన వర్షాలు ఇక అంచనా వేసినట్లు ముందుగానే ఋతుపవనాలు కేరళను చేరితే, 2009 తర్వాత తొలిసారి వర్షాకాలం ముందుగా వస్తున్నట్లు ఐఎండీ వెల్లడించింది. 2009 సంవత్సరంలో మే 23వ తేదీన నైరుతి కేరళను తాకినట్లు ఐఎండీ డేటా ప్రకారం తెలుస్తుంది. సాధారణంగా జూన్ 1వ తేదీ వరకు కేరళలోకి నైరుతి ఋతుపవనాలు ప్రవేశించి, జూలై 8వ తేదీలోగా దేశవ్యాప్తంగా విస్తరిస్తాయి. ఇక సెప్టెంబర్ 17వ తేదీ నుంచి ఆగ్నేయ దిశ నుంచి తిరోగమనం అవుతాయి. అక్టోబర్ 15వ తేదీలోగా పూర్తి ఆ ఋతుపవనాలు వెళ్లిపోతాయి.

# మస్కట్‌లో చిక్కుకున్న కార్మికులకు విముక్తి

## •కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు చొరవతో స్వస్థలాలకు



శ్రీకాకుళం (చైతన్యరథం): మస్కట్లో చిక్కుకున్న తొమ్మిది మంది శ్రీకాకుళం జిల్లా వాసులు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్నాయుడు చొరవతో స్వస్థలాలకు చేరుకున్నారు. ఇచ్ఛాపురం ప్రాంతానికి చెందిన 9 మంది ఉపాధి కోసం మస్కట్ వెళ్లి అక్కడి కంపెనీ నిర్వాకంతో మోసపోయారు. వారు అక్కడ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బాధితుల కుటుంబ సభ్యులు ఇటీవల కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నెలల తరబడి మస్కట్‌లో మగ్గిపోయారు. కొన్ని నెలలు పాటు పని, జీతం లేకుండా.. అర్థాకలితో అల్లాడిపోయారు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. ఆయన కార్మికులతో వీడియోకాల్లో మాట్లాడి క్షేమంగా తీసుకొస్తామని భరోసా ఇచ్చారు. విదేశాంగశాఖ, మస్కట్లోని భారత దౌత్య కార్యాలయం, తెదేపా ఎన్ఆర్ఐ విభాగాన్ని సమన్వయం చేసి కార్మికులకు వసతి, ఆహారం అందేలా చర్యలు తీసుకున్నారు. ముంబయి విమానాశ్రయం అధికారులకు పర్యవేక్షణ బాధ్యత అప్పగించారు. అక్కడి నుంచి శ్రీకాకుళం రావడానికి ప్రయాణ, ఇతర ఖర్చులను రామ్మోహన్నాయుడు భరించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి కార్మికులు, వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ప్రజాసమస్యల పరిష్కారమే తనకు ముఖ్యమని కేంద్రమంత్రి స్పష్టం చేశారు. 'రాజకీయాలకు అతీతంగా ప్రజల సమస్యలే తనకు ముఖ్యమని.. ఎక్కడైనా ఎవరికైనా సాయం అవసరమైతే వెంటనే తెలియజేయండి' అని సూచించారు. అత్యంత వేగంగా సాయం చేశారని కార్మికులు ఆనందం వ్యక్తం చేశారు.

# యుద్ధం వేళ విశాఖలో అనుమానాస్పద వ్యక్తి హల్‌చల్



ప్రహాలాం ఉగ్రదాడి ఘటనను సీరియస్ గా తీసుకున్న భారత్.. పాక్ ఉగ్రమూకల స్థావరాలపై ఈ నెల 7న 'ఆపరేషన్ సిందూర్ పేరుతో మెరుపు దాడులు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో భారత్- పాక్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తీవ్ర సాయికి చేరాయి. దీంతో భారత్ పలు రాష్ట్రాల్లో బాక్ అవుట్ విధించింది. ఈ తరుణంలో తెలుగు రాష్ట్రాల్లో హై అలర్ జారీ చేశారు. ఇప్పటికే తిరుమలలో ఆక్టోపస్ బలగాలు ముమ్మర తనిఖీలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఇండియా-పాక్ యుద్ధ వాతావరణ నేపథ్యంలో విశాఖ ఎయిర్ పోర్టుకులో భద్రత కట్టుదిట్టం చేశారు. ఈ తరుణంలో కేంద్ర పారిశ్రామిక భద్రతా దళాలు (సీఐఎస్ఎఫ్) వాహనాలను తనిఖీలు చేశారు. అనంతరం భారత్-పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో విశాఖలో హై అలర్ట్ జారీ చేశారు. ఈ క్రమంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐఎస్ఎఫ్, పోలీసులతో నిరంతర సమన్వయం చేసుకుంటూ భద్రతా చర్యలు అమలు చేస్తున్నారు. విమానాశ్రయం లోపల, వెలుపల ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా ప్రతి కదలికను నిశితంగా గమనిస్తున్నారు. ఈ నేపథ్యంలో విశాఖ నగరంలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతూ ఆందోళనకు గురి చేశాడు. సిరిపురం జంక్షన్ వద్ద ఫొటోలు తీస్తున్న సదరు వ్యక్తిని విశాఖ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. భారత్-పాకిస్తాన్ మధ్య జరుగుతున్న పరిణామాల మధ్య ఆ వ్యక్తి అనుమానాస్పదంగా తిరగడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# అన్ని నియోజకవర్గాల్లో ఎంఎస్‌ఎంఈ పార్కులు



శృంగవరపుకోట (చైతన్యరథం): రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలు (ఎంఎస్ఎంఈ) ఏర్పాటు చేస్తామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శృంగవరపుకోట నియోజకవర్గం కొత్తవలస మండలం బలిఘట్టంలో ఎంఎస్ఎంఈ పార్కుకు, నెల్లిమర్ల నియోజకవర్గ కేంద్రంలోని సారిపల్లిలో ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ ఏర్పాటుకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేశంలో ఏర్పాటయ్యే ఏ కొత్త పరిశ్రమైనా రాష్ట్రంలో ఏర్పాటు చేసే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఏర్పాటు చేసే పరిశ్రమలకు సంపూర్ణ సహకారం అందించేందుకు సీఎం ముందుకు వస్తున్నారు. 'రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు, ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేయాలని కృత నిశ్చయంతో సీఎం ఉన్నారు. మొదటి దశలో 50 పార్కులు ఏర్పాటు చేస్తాం. జిల్లాలో శృంగవరపుకోట, గజపతినగరం, బొబ్బిలి, నెల్లిమర్ల నియోజకవర్గాల్లో ఏర్పాటు చేస్తాం. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలి. వారికి 25 నుంచి 45 శాతం వరకు రాయితీలు, విద్యుత్, పన్నుల్లో రాయితీ, బ్యాంకుల నుంచి రుణాలు పొందేందుకు అవసరమైన సహకారం అందిస్తాం. బలిఘట్టం ఎంఎస్ఎంఈ పార్కులో రూ.96 కోట్లతో 76 చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు అయ్యే అవకాశం ఉంది. వీటివల్ల 1500 మందికి ప్రత్యక్షంగా, 500 మందికి పరోక్షంగా ఉపాధి కలుగుతుంది. సారిపల్లి వద్ద మూడు ఎకరాల స్థలంలో రూ.15.55 కోట్లతో నిర్మించనున్న ప్లాటెడ్ కాంప్లెక్స్ ద్వారా 200 మందికి ప్రత్యక్షంగా, 50 మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుంది.' అని అన్నారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ యువత స్వయం ఉపాధి యూనిట్లను స్థాపించేందుకు అనువుగా వారికి శిక్షణ ఇచ్చి ప్రోత్సహించడానికి ప్రభుత్వం ప్రణాళికతో ముందుకు వెళ్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కోళ్ల లలితకుమారి, లోకం నాగమాధవి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మురళీమోహన్, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీధర్, ఆర్డీవోలు దాట్ల కీర్తి, బి.రామకృష్ణ, తహసీల్దార్లు నీల కంఠరావు, సుదర్శనరావు, ఎంపీపీలు నీలంశెట్టి గోపెమ్మ, బంటుపల్లి వాసుదేవరావు, నెల్లిమర్ల నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే యనమల దివ్య కృషితో మళ్ళీ రోడెక్కిన పల్లెవెలుగు బస్‌లు

## •ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్న ఎమ్మెల్యే



తుని (చైతన్యరథం): ఎమ్మెల్యే యనమల దివ్య ఆదేశాలకు అనుగుణంగా ఆర్టీసీ అధికారులు తుని వయా డి.పోలవరం, ఇందుగపల్లి, బిళ్ళనందూరు, సూరవురాజుపేట, భీమవరపుకోట, జగన్నాధపురం మీదుగా కోటనందూరుకు ఆర్టీసీ రధచక్రాలు పరుగులు పెడుతున్నాయి. శనివారం మండల టీడీపీ అధ్యక్షుడు గాడి రాజబాబు అధ్యక్షతన కోటనందూరులో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే యనమల, మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, సీనియర్ నేత యనమల రాజేష్‌లతో కలిసి నూతన బస్‌సర్వీస్‌ను ప్రారంభించారు. అనంతరం అల్లిపూడి గ్రామానికి చెందిన ఓ బాధిత కుటుంబానికి రెండు లక్షల చెక్కును అందజేసారు. అనంతరం తుని మండలం ఎన్ .ఎస్ వెంకటనగరం రామాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే యనమల దివ్య సీతారాములకు ప్రత్యేక పూజలు గావించి ఆలయాన్ని ప్రారంభించారు. కోటనందూరు మండల పర్యటనలో అంకంరెడ్డి రమేష్, పెంటకోట భాస్కర సత్యనారాయణ, గొర్లి అచ్చియ్యనాయుడు, వెలగా కృష్ణారావు, పెనుమచ్చ నాగేశ్వరరావు, బంటుపల్లి వెంకటేశ్వరరావు, చిటికెల సత్యనారాయణ, పోతల సూరిబాబు, ఎర్రా చినసత్యనారాయణ, అంకంరెడ్డి బుల్లిబాబు, రుత్తల సత్యసీతయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తాం : కందుల



నిడదవోలు (చైతన్యరథం): రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫి శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు పట్టణంలోని వెలగపూడి దుర్గాంబ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వికాస జేకేసీ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళాను మంత్రి దుర్గేష్ జ్యోతి ప్రారంభించి మాట్లాడారు. జాబ్ మేళాకు సుమారు 42 కంపెనీలు హాజరయ్యాయని ఆయా కంపెనీల్లో రెండు వేలకు పైగా ఉద్యోగా వకాశాలు కల్పిస్తారన్నారు.ఈ జాబ్ మేళాలో ఐటీ రంగానికి చెందిన కంపెనీలు అధికంగా వచ్చాయని.. త్వరలో నిర్వహించే మరో జాబ్ మే ళాలో టూరిజం, ఆతిథ్య రంగాలకు సంబంధించిన కంపెనీలను ఆహ్వానిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పించి తీరుతామన్నారు. అనంతరం జాబ్ మేళాలో కార్పోరేట్ కంపెనీలు నిర్వహించిన ఇంటర్వ్యూలకు 2386 మంది హాజరుకాగా 1038 మంది ఉద్యోగాలు సాధించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వికాస పీడీ కె.లచ్చారావు,జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి మురళి, కళాశాల ప్రిన్సిపాల్స్ డాక్టర్ రుద్ర, డాక్టర్ కె.జ్యోతి, నాయకులు పాల్గొన్నారు.

# కమిటీలతో సంస్థాగతంగా బలోపేతం : కలిశెట్టి

అన్ని నియోజకవర్గాల్లో గ్రామ, మండల స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేసి... టీడీపీని మరింత బలోపేతం చేయాలని విజయనగరం ఎంపీ కలి శెట్టి అప్పలనాయుడు సూచించారు. చిలకపాలెంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఎచ్చెర్ల నియోజకవర్గ స్థాయి టీడీపీ కార్యకర్తలతో కమిటీలు ఏర్పాటు, సంస్థాగత నిర్మాణం, రాబోయే రోజుల్లో చేపట్టబోయే కార్యక్రమాలపై విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కమిటీల ఏర్పాటులో ఎలాంటి జాప్యం చేయొద్దన్నారు. ప్రభుత్వం చేపడుతున్న పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు, పథకాలను అర్హులకు చేరవేయడం, పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో కార్యకర్తలు ప్రధాన భూమిక పోషించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పరిశీలకుడు ఆనెపు రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షులు బెండు మల్లేశ్వరరావు, కుమరావు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ జనసేవ కేంద్రంగా ఇండియా పోస్ట్ : పెమ్మసాని




కేరళా (చైతన్యరథం): ఇండియా పోస్ట్ ను డిజిటల్ జన సేవా కేంద్రంగా మారుస్తున్నాం. ఇండియా పోస్ట్ జాతీయ లాజిస్టిక్ భాగస్వామిగా మారుతుంది. 100% అక్షరాస్యత కలిగిన కేరళ రాష్ట్రానికి రావడం గౌరవంగా ఉంది. ప్రజా అవసరాలను దృష్టిలో పెట్టుకుని చేసిన వినూత్న ఆవిష్కరణలో కేరళ ముందుంది." అని గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడారు. కేరళలోని తిరువనంతపురం జిల్లాలో పెమ్మసాని శనివారం పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా ప్రముఖ వైష్ణవ ప్రాచీన, పుణ్యక్షేత్రమైన తిరువనంతపురంలోని అనంతపద్మనాభ స్వామిని అలాగే శివగిరి మఠాన్ని కూడా పెమ్మసాని దర్శించారు. అనంతరం జిల్లాలోని వరకలలో తపాలా కార్యాలయాన్ని అటింగల్ పార్లమెంట్ సభ్యులు అడూర్ ప్రకాష్, స్థానిక ఎమ్మెల్యే వి.జాయ్, కేంద్ర మాజీ సహాయ మంత్రి వి.మురళీధరన్‌తో కలిసి పెమ్మసాని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తపాలా శాఖను సమగ్ర అభివృద్ధికి వేదికగా, ముఖ్య పౌర సేవల, డిజిటల్ మరియు ఆర్థిక సాధికారికతకు కేంద్రంగా సిద్ధం చేస్తున్నామన్నారు. 'ప్రపంచవ్యాప్తంగా తపాలా వ్యవస్థ తగ్గుముఖం పడుతున్న ఈ డిజిటల్ యుగంలో భారత్ పోస్టు ఒక కొత్త మార్గాన్ని ఎంచుకుంది. ప్రపంచంలోనే అతి పెద్ద నెట్వర్క్ ఉన్న తపాలా శాఖ ఇప్పటిదాకా 1.6 లక్షలకు పైగా పోస్ట్ ఆఫీస్‌లను కలిగి ఉంది.' అని ఆయన అన్నారు. ఈ మార్పు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దూరదృష్టితో జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 70 శాతం ఖాతాలు ఉన్న ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంకును నడుపుతుందని, 1000కి పైగా డాక్ ఘర్ నిక్యాత్ కేంద్రాల ద్వారా చిన్న వ్యాపారాలను ప్రోత్సహిస్తుందని అన్నారు. 420కి పైగా పోస్ట్ ఆఫీస్లు పాస్పోర్ట్ సేవలను కూడా అందిస్తున్నాయని, ఆధార్, మొబైల్ బ్యాంకింగ్, కోడ్ లావాదేవీలతో ప్రతి పౌరుడిని డిజిటల్ ఇండియాలో భాగస్వామ్యులని చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఇతర కేంద్ర, రాష్ట్ర శాఖలతో కలిపి ఇంటి వద్ద సేవలను అందించేందుకు గట్టి నెట్వర్క్ ఉపయోగించుకుంటున్నామని వివరించారు. ఇండియా పోస్ట్ రోజూ ఉత్తరాలే కాదు సామాజిక సమావేశం, గౌరవం మెరుగైన భవిష్యత్తును అందిస్తోందని పెమ్మసాని తెలిపారు.

# కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్‌కి విశేష స్పందన

◆ రెండో రోజు తలపడిన 8 జట్లు



నందిగామ (చైతన్యరథం): గ్రామాల్లో క్రికెట్ ఆడగలిగే శక్తి సామర్థ్యాలు ఉండి అవకాశాలు లేక మరుగున పడిపోతున క్రికెట్ క్రీడాకారులకు వీరులపాడు మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేసినందుకు ఎంపి కేశినేని శివనాథ్‌కి శనివారం తలపడిన 8జట్లు క్రీడాకారులు ధన్యవాదాములు తెలిపారు. జమ్మవరం గ్రామంలో జిల్లా పరిషత్ స్కూల్ గ్రౌండ్ లో జరుగుతున్న వీరులపాడు మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ రెండు రోజు శనివారం జరిగిన మొదటి మ్యాచ్‌లో జమ్మవరం నుంచి సి.బి.సి.సి అల్లూరు టీమ్, లెవన్ లైన్స్ జమ్మవరం పోటీ పడగా 54 పరుగుల తేడాతో సి.బి.సి.సి అల్లూరు టీమ్ విజయం సాధించింది. రెండో మ్యాచ్ లో ఆర్.సి.బి తాటిగుమ్మి టీమ్ తో తలపడిన ఎమ్.బి.సి.సి యూత్ దొడ్డదేవరపాడు టీమ్ 52 పరుగుల తేడా గెలుపొందింది. మూడో మ్యాచ్ లో ఎస్.ఆర్. యూత్ పొన్నవరం టీమ్ తలపడిన ఆర్.సి.సి యూత్ జయంతి టీమ్ ఏడు వికెట్ల తేడాతో విజేత నిలిచింది. అలాగే నాలుగో మ్యాచ్ లో జుజ్జూరు జైభీమ్ యూత్ తో తలపడిన జమ్మవరానికి సంబంధించి లెవన్ హిట్టర్స్ 58 పరుగుల తేడా విజయం అందుకుంది. ఈ టోర్నమెంట్ మూడు రోజు ఆదివారం కూడా లీగ్ మ్యాచులు జరుగుతాయని మ్యాచ్ నిర్వహిస్తున్న పంఛాయతీ ఛాంపియన్స్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఛాంపియన్స్ యర్రంరెడ్డి ప్రదీప్ కుమార్, కట్ట సునీల్, సింగి సురేష్, కొప్పుల రాము, ఆవుల దొడ్డి హనుమంతరావు, కారం శ్రీనివాసరావు పాల్గొనగా, జమ్మవరం, బోడవాడ గ్రామ ప్రజలు పాల్గొని మ్యాచ్‌లను వీక్షించారు.

# ఉగ్రభూతాన్ని అంతమొందించడమే భారత్ లక్ష్యం

- పాకిస్థాన్ అభ్యర్థన మేరకే కాల్పుల విరమణ...
- సైనికులకు ప్రజలంతా మద్దతుగా నిలవాలి : మన్నవ మోహన్‌కృష్ణ



గుంటూరు (చైతన్యరథం): దేశంలో ఉగ్రవాదాన్ని పూర్తిస్థాయిలో అంతమొందించేందుకు కృషి చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ పిలుపునిచ్చారు. దేశ సరిహద్దుల్లో కాల్పుల విమరణకు ఇరు దేశాలు అంగీకారం తెలపడం శుభసూచకమని, కానీ పాకిస్థాన్ ముష్కరులు రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతున్న వేళ అంత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. పాకిస్థాన్ అభ్యర్థన మేరకే కాల్పుల విమరణ జరిగిందని, ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న ఉగ్రభూతాన్ని అంతం చేయడమే భారత్ అసలు లక్ష్యమన్నారు. దేశం కోసం పోరాడుతున్న జవానులకు మనోధైర్యాన్ని కలుగచేసేందుకు అందరం సమష్టి కృషి చేద్దామన్నారు. మతం అడిగి హతమారుస్తున్న ఉగ్రవాదులను అంతమొందించాల్సిన అవసరం ఈ సమాజానికి ఎంతైనా ఉందన్నారు. సమాజ శ్రేయస్సు కోసం దేశభక్తితో పౌరులంతా ఏకాగ్రతతో ఉండాలని కోరారు. భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధ మేఘాలు కమ్మిన వేళ పోరాటం చేస్తున్న సైనికులకు ప్రజలంతా మద్దతుగా నిలవాలన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత సైనికులకు ఆయన తన సంఘీభావాన్ని ప్రకటించారు. పాకిస్థాన్ ఉగ్రవాదంపై మన సైనికులు చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడం మన సైనికుల అంకిత భావానికి నిదర్శమన్నారు. ఉగ్రవాద చర్యలపై భారతదేశం తీసుకున్న నిర్ణయాన్ని ప్రపంచంలోని మెజారిటీ దేశాలు సమర్థిస్తున్నాయని, ఉగ్రవాద స్థావరాలను మట్టుపెట్టి, పోరాటం చేసిన సైనికులకు ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఆపరేషన్ సిందూర్ భారతదేశాన్ని సగౌరవంగా తలెత్తుకునేలా చేసిందన్నారు. పహేల్గాం ముష్కరుల దాడికి ప్రతీకారం తీర్చుకున్నామని అన్నారు. ఉగ్రవాదం అంతమయ్యేంతవరకు ఇది కొనసాగుతుందని తెలిపారు. పాకిస్తాన్ ఇకనైనా బుద్ధి తెచ్చుకోవాలని.. ఉగ్రవాదులకు స్థావరాలను కల్పించడం మానేయాలని మోహనకృష్ణ హితవు పలికారు.

**మురళీనాయక్ త్యాగాన్ని దేశం మరవదు**

ఆపరేషన్ సిందూర్‌లో వీరమరణం పొందిన సత్యసాయి జిల్లాకు చెందిన మురళీనాయక్ కుటుంబానికి మన్నవ మోహనకృష్ణ తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. మురళీనాయక్ త్యాగాన్ని దేశం మరవదని, సరిహద్దుల్లో శత్రుమూకలతో పోరాడి ప్రాణాలు కోల్పోవడం పట్ల విచారం వ్యక్తం చేశారు.

# పెడనలో పీఎం సూర్య ఘర్ యోజనపై అవగాహన సదస్సు

- పథకం విశిష్టతను ప్రజలకు తెలియజేసిన ఎమ్మెల్యే కాగిత



పెడన (చైతన్యరథం): పీఎం సూర్య ఘర్ యోజనను రాష్ట్రం మొత్తం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ వ్యాఖ్యానించారు. శనివారం పెడన మండలం నందమూరు గ్రామంలో పీఎం సూర్మఘర్‌పై ప్రత్యేక అవగాహన సదస్సు, సింగిల్ విండో కార్యక్రమం నిర్వహింఒచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ... భారతదేశ ప్రధాని నరేంద్రమోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన పీఎం సూర్య ఘర్ యోజనను ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. పీఎం సూర్య ఘర్ పథకం కింద ప్రతిఇంటికి 2 కిలోవాట్ రూఫ్ టాప్ సోలార్ యూనిట్ అమర్చుకుంటే... ఎస్సీలకు కేంద్ర ప్రభుత్వం రూ.60వేలు, రాష్ట్రం రూ.55వేలు సబ్సిడీగా అందజేస్తుందని, బీసీలకు కేంద్రం రూ.60 వేలు, రాష్ట్రం రూ.20 వేలు ఇస్తుందన్నారు. ఈ సోలార్ సిస్టం ద్వారా మీరు వాడిన మిగిలిన విద్యుత్‌ని యూనిట్‌కు రూ.2.90 చొప్పన ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. విద్యుత్ బిల్లు భారం నుంచి తగ్గించుకునే విధంగా ప్రభుత్వం ఈ పీఎం సూర్య ఘర్ యోజన పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఇటీవల ఈ పథకం ద్వారా ఇంటిపై సోలార్ సిస్టమ్ అమర్చుకున్న వారికి సబ్సిడీ కింద వచ్చే నగదను ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ చెక్కుల రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# బహ్రెయిన్ దేశంలో ఘనంగా శ్రీ పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలు

- ముఖ్యఅతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండి




బహ్రెయిన్ /అమరావతి(చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అదేశాలు మేరకు అమరజీవి పొట్టిశ్రీరాములు 125వ జయంతి వేడుకలు ఏడాది పాటు నిర్వహించడం జరుగుతుంది. అందులో భాగంగానే ప్రపంచవ్యాప్తంగా తెలుగు ప్రజలు ఉన్న దేశాలల్లో పొట్టిశ్రీరాములు జయంతి వేడుకలు నిర్వహించడం జరుగుతుంది. అంతర్జాతీయంగా తొలిసారిగా బహ్రెయిన్ దేశంలో తెలుగుకళాసమితి అధ్యక్షులు పి.జగదీష్ అధ్వర్యంలో పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్ మాట్లాడుతూ.. తెలుగు ప్రజల కోసం ప్రత్యేక రాష్ట్రసాధన కోసం ప్రాణత్యాగం చేసిన వ్యక్తి అమరజీవి పొట్టి శ్రీరాములు ఆయన త్యాగం మరువలేనిదని అన్నారు. పొట్టి శ్రీరాములు జీవితం భావితరాలకు ఆదర్శమన్నారు. తెలుగువారి క్షేమం, అభివృద్ధి కోసం తన జీవితాన్ని అర్పించిన త్యాగమూర్తి అని కొనియాడారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రంలో పేదరిక నిర్మూలన కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీపొట్టి శ్రీరాములు జీవిత చరిత్రను వీడియో రూపంలో ప్లే చేయడం జరిగింది. కార్యక్రమానికి బహ్రెయిన్ దేశంలోని తెలుగు ప్రజలు భారీగా పాల్గొన్నారు.



# భావితరాలకు గుర్తుండాలని ఎంఎస్ఎంఈ పార్కుకు సిందూర్ పేరు

### నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి వెల్లడి

నెల్లూరు, (చైతన్యరథం): నెల్లూరు రూరల్ నియోజకవర్గం అమంచర్ల గ్రామంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి చేతుల మీదుగా ఎంఎస్ఎంఈ పార్క్‌కు శంకుస్థాపన జరిగింది. దీనికి భారత్ సిందూర్ఎంఎస్ఎంఈ పార్క్ గా నామకరణం చేశారు. ఈ సంధర్భంగా భారత్ మాతాకీ జై, ఖబడ్దార్ ఖబడ్దార్ పాకిస్థాన్ అని కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి నినాదాలు చేశారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని ఆమంచర్ల గ్రామంలో 60 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న భారత్ సింధూర్ ఎంఎస్ఎంఈ



పార్క్‌కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనలతో చేసిన రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. 60 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్క్ పరిశ్రమల ఏర్పాటుకు సిద్ధంగా ఉంది. భవిష్యత్తులో మరింత విస్తరిస్తామన్నారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలొ వందలాది మందికి యువతకు ఉపాధి అవకాశం లభిస్తుందన్నారు. నెల్లూరు రూరల్ అమంచర్ల పార్కు భవిష్యత్ తరాలకు గుర్తుండేందుకు భారత్ సిందూర్ ఎంఎస్ఎంఈ పార్క్‌గా పేరు పెట్టామన్నారు. పాకిస్థాన్ ఉన్మాదులు భారత దేశాన్ని ఉగ్రవాదంతో భయపెట్టాలని చూస్తే ఇక్కడ భయపడేవాళ్ళెవరూ లేరన్నారు. పాకిస్తాన్ భారత దేశంతో అనేక యుద్దాల్లో ఓడినా బుద్ధి రాలేదన్నారు. కేవలం మూడు రోజుల్లోనేదేశ పౌరుషాన్ని భారతీయులు పాకిస్తాన్‌కు చూపించారన్నారు. పాకిస్థాన్‌పై భారత దేశం పూర్తి స్థాయి యుద్ధం ప్రకటిస్తే ఒక్క రాత్రిలోనే పాకిస్తాన్ ప్రపంచ పటం నుండి తుడిచిపెట్టుకు పోతుందన్నారు. పాకిస్థాన్‌తో యుద్ధంలో అమరుడైన మురళీ నాయక్ త్యాగాన్ని ఎప్పటికి మరచిపోలేమని సంతాపం ప్రకటించారు.

# బిజిలీ యోజనతో ఇంటింటికీ వెలుగు

### ప్రత్యేక రాయితీతో సోలార్ రూఫ్ టాప్‌లకు ప్రోత్సాహం

### - ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, (చైతన్యరథం): పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకంలో సోలార్ ద్వారా వెలుగులు అందించాలన్నదే లక్ష్యం అని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పేర్కొన్నారు. అమరావతి గ్రౌండ్స్‌లో శ్రీరామ ఎంటర్ ప్రైజస్ సంస్థ సోలార్ రూఫ్ టాప్ ప్రచార వాల్ పోస్టర్‌ను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ముక్కు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రేరణతో కేంద్ర ప్రభుత్వ సబ్సిడీతో పాటు తన వ్యక్తిగత నిధుల నుండి రూ. 20,000/- అదనంగా రాయితీగా అందించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఇళ్లపై సోలార్ రూఫ్ టాప్‌లను ఏర్పాటు చేసుకొని విద్యుత్ బిల్లులు ఆదా చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ ఎంటర్ ప్రైజస్ సంస్థ యజమాని పాపిరెడ్డి రామాంజనేయరెడ్డి, నాయకులు, పాల్గొన్నారు.



# మహిళా సాధికారతే సీఎం చంద్రబాబు లక్ష్యం

### మంత్రి పొంగూరు నారాయణ వెల్లడి

నెల్లూరు, (చైతన్యరథం): నగరంలోని 52 వ డివిజన్‌లో బీసీ కార్పొరేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని రాష్ట్ర పురపాలక, పట్టణ అభివృద్ధి శాఖ మంత్రివర్యులు డాక్టర్ పొంగూరు నారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనకు డివిజన్ ప్రజలు, నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం కుట్టు శిక్షకులను వివరాలు అడిగి మంత్రి తెలుసుకున్నారు. మహిళా సాధికారతపై సీఎం చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టి పెట్టారని..మహిళలను పారిశ్రామిక వేత్తలుగా చేయాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పం అని మంత్రి నారాయణ తెలిపారు. జిల్లాలో 4967 మందికి మిషన్‌లు



ఇవ్వటంతో పాటు శిక్షణ ఇప్పిస్తున్నామని, వృత్తిలో నైపుణ్యత పెంపొందించడానికి రోజుకి రెండు షిఫ్టుల్లో 72 మందికి ట్రైనింగ్ ఇస్తున్నామని అందులో ఒక్కొక్కరిపై 21700 రూపాయలను ప్రభుత్వం వెచ్చిచ్చిందని తెలిపారు..10 కోట్ల 80 లక్షల రూపాయలు కుట్టు మిషన్ లు, శిక్షణకు నెల్లూరు జిల్లాకు కేటాయించమన్నారు..ఎంఎస్ ఎం ఈ నడుపుతున్న రమాదేవి ఆర్గనైజేషన్ ని హైదరాబాద్ లో పరిశీలించనాని 54వ డివిజన్‌లో 12 కోట్లతో ఎంఎస్ఎంఈ పార్కు భవనం కడుతున్నామన్నారు. 26 యూనిట్లలో 100 మందికి అవకాశం కల్పిస్తామని, పరిశ్రమలు వస్తేనే రాష్ట్రం ఆర్థికంగా నిలదొక్కుకొంటుంది అని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మామిడాల మధు టీడీపీ సీనియర్ నేత వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్లపాక అనురాధ మాజీ జెడ్పీటీసీ విజేత రెడ్డి కార్పొరేటర్ అస్మమోయినుద్దీన్ ప్రెసిడెంట్ వెంకయ్య యాదవ్, మైనారిటీ ప్రెసిడెంట్ సయ్యద్ ఇక్బాల్, జనరల్ సెక్రటరీ పాశమోహిద్దీన్ సుధీర్, టీడీపీ ముఖ్య నేతలు నాయకులు పాల్గొన్నారు.

# టీడీపీ సభ్యత్వ పరిహారం అందజేత

### మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే విజయకుమార్

సంతనూతలపాడు, (చైతన్యరథం): రాష్ట్ర ముఖ్యమంత్రి జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆదేశాల మేరకు శనివారం నాగులుప్పలపాడు మండలం ఓమ్మెవరం గ్రామంలో ఇంటివలే రోడ్డు ప్రమాదంలో మరణించిన నార్నె సురేష్ కుటుంబానికి టీడీపీ సభ్యత్వం కార్యకర్తల సంక్షేమ నిధి నుంచి 5 లక్షల రూపాయలను అందించి వారి కుటుంబ సభ్యులను సంతనూతలపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే బీఎన్ విజయ్ కుమార్ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో మండల పార్టీ అధ్యక్షులు తెళ్ళ మనోజ్ కుమార్, క్లస్టర్ ఇంచార్జిలు కాకర్ల లక్ష్మి వరప్రసాద్, గుమ్మడి సాయిబాబా గారు,గ్రామ పార్టీ అధ్యక్షులు కొమ్మాలపాటి సురేష్, గ్రామ సర్పంచ్ పాలపర్తి బాలకోటయ్య, ఈదర రాజా, కనగాల శ్రీనివాసరావు, కొమ్మినేని రమేష్, నందిగం కోటయ్య, సెల్వం, పార్వతి, మండల నాయకులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.







## వీర సైనికుడా నీకు జోహార్ ...
## నీ త్యాగాన్ని దేశం మరిచిపోదు!

### మంత్రి సవిత

గోరంట్ల, (చైతన్యరథం): భారత్ – పాకిస్తాన్ మధ్య జరుగుతున్న యుద్ధంలో ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా దేశ రక్షణ విధుల్లో ఉండగా పాక్ సైనిక కాల్పుల్లో వీరమరణం పొందిన జవాన్ మురళి నాయక్ త్యాగాన్ని భారతజాతి ఎన్నడు మరిచిపోదని మంత్రి సవితమ్మ అన్నారు. బెంగుళూరు విమానాశ్రయం నుండి సొంతగ్రామం గోరంట్ల మండలం కళ్లితాండ గ్రామానికి సైనిక అధికారులతో కలసి పార్థివ దేహాన్ని తీసుకొని వచ్చారు. అనంతరం ఘన నివాళులు అర్పించి వీరోచిత పోరాటంలో తనువు చాలించిన మురళి నాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని మంత్రి సవితమ్మ ప్రార్థించారు.

## నేడు కొవ్వొత్తుల ప్రదర్శన

### పార్టీలకతీతంగా హాజరుకావాలని ఎమ్మెల్యే దగ్గుపాటి పిలుపు

అనంతపురము, (చైతన్యరథం): వీర జవాన్ మురళీ నాయక్‌కు సంతాపంగా ఆ కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించనున్నారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమంలో పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరు హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు. సాయంత్రం ఐదున్నర గంటలకు క్లాక్ టవర్ వద్ద నుంచి నుంచి సప్తగిరి సర్కిల్లోని అమరవీల స్థూపం వరకు ఈ ప్రదర్శన సాగనుందని ఆయన తెలిపారు.





# యుగపురుషుడు ఎన్టీఆర్ ఆశయ సాధనకు కృషి

### విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్

వరికుంటపాడుం, (చైతన్యరథం): యుగపురుషుడు ఎన్టీఆర్ అని ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం వరికుంటపాడు మండలం సాతువారి పల్లి గ్రామంలో తెలుగుదేశం మండలం, గ్రామ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన తెలుగుదేశం వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చేతుల ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉదయగిరి మండల ఉపాధ్యక్షులు గుండుపల్లి మాలకొండయ్య, దాతృత్వం మరువలేనిది అన్నారు. ఇప్పటికే మండలంలో 5 ఎన్టీఆర్ విగ్రహాలను అందజేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. సాతువారి పల్లిలో కూడా ఆయన దాతృత్వం ద్వారానే విగ్రహం అందించడం జరిగిందన్నారు. స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగువారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టారన్నారు. కిలో రెండు రూపాయల బియ్యం పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఆడపడుచులకు ఆస్తిలో హక్కు కల్పించారు అన్నారు. ఎన్నో సంస్కరణలు పేదల కోసం ఆయన హయాంలో జరిగాయన్నారు. అటువంటి వారిని స్మరించుకుంటూ, వారి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలం, గ్రామ నాయకులు పాల్గొన్నారు.



# అమరజవాను మురళీకి మనసారా వందనం

**మురళీ కుటుంబానికి పరామర్శ.. 2లక్షల రూపాయల సాయం ఎమ్మెల్యే సునీత, శ్రీరామ్ ఘననివాళులు**

రాప్తాడు, (చైతన్యరథం): ఒక వైపు ఉప్పొంగే గర్వం.. మరోవైపు గుండెలు పగిలే ఆవేదన.. ప్రస్తుతం వీర జవాన్ మురళీ నాయక్ మరణంతో మానవ హృదయాలు జీర్ణించుకోలేని కఠోర నిజాలివని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. ఇండియా-పాక్ యుద్ధం నేపథ్యంలో వీరమరణం పొందిన జవాన్ మురళీ నాయక్ తల్లిదండ్రులను వారు పరామర్శించారు. శనివారం సాయంత్రం గోరంట్ల మండలం కల్లితాండాకు సునీత, శ్రీరామ్ వెళ్లి మురళీ నాయక్ చిత్రపటానికి నివాళులర్పించారు. అక్కడ గుండెలు పగిలేలా రోదిస్తున్న మురళీ తల్లిదండ్రులను వారు ఓదార్చారు. మురళీ తల్లి మాట్లాడలేని పరిస్థితుల్లో ఉండగా తండ్రి శోకతప్త హృదయంతో భారంగా స్పందించారు. ఆ కుటుంబాన్ని ఓదార్చి 2 లక్షల రూపాయల సాయం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ జవాన్ మురళీ నాయక్ వీరమరణం దేశానికే గర్వకారణమన్నారు. ఆయన ధైర్య సాహసాలు చిరస్మరణీయమన్నారు. ఇండియా-పాకిస్థాన్ యుద్ధంలో మన దేశానికి రక్షణ కవచంలా నిలబడి ప్రాణాలు అర్పించి మురళీ ఉన్నత శిఖరాల్లో నిలిచాడన్నారు. అయితే కన్న కొడుకుని పోగొట్టుకున్న ఆ తల్లిదండ్రుల ఆవేదనను ఎవరూ తీర్చలేమన్నారు.

మురళీ ఆత్మకు శాంతి కలిగేలా యావత్ భారతావని కోరుకుంటోందన్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ మురళీ నాయక్ దేశం కోసం ప్రాణాలు అర్పించడం గర్వకారణమైనా కనిపెంచిన తల్లిదండ్రులను చూస్తే వర్ణించలేని బాధ గుండెలకు తగులుతోందన్నారు. 25 సంవత్సరాలకే తన ప్రాణాన్ని దేశానికి అర్పించడం అన్నది ఎంతో గర్వకారణమన్నారు. మురళీ తండ్రి కూడా తన కొడుకు దేశం కోసం ప్రాణాలు అర్పించాడని గర్వంగా చెబుతున్నారని.. కానీ అదే సందర్భంలో ఉన్న ఒక్క కొడుకును కోల్పోవడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. మురళీ మరణం దేశంలో యువతకు స్ఫూర్తిదాయకమని.. అల్లరచిల్లరగా, బాధ్యత లేకుండా తిరుగుతున్న వారు మురళీ త్యాగాన్ని, ధైర్య సాహసాలను చూసి ఎంతో నేర్చుకోవాలన్నారు. మురళీ కుటుంబానికి ప్రభుత్వం కచ్చితంగా అండగా ఉంటుందన్నారు.







# సీఎం చంద్రబాబు హృదయస్పందన గొప్పది

**కష్టాల్లో ఉన్న కుటుంబాలకు సీఎం సహాయనిధి ఆసరా**

**ధర్మవరం ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్**

**8 మందికి లక్షా 93వేల రూపాయల చెక్కుల పంపిణీ**

ధర్మవరం, (చైతన్యరథం): అనారోగ్యంతో ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్సలు పొంది ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలను సీఎంఆర్ఎఫ్ ఆదుకుంటోందని ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. ధర్మవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన 8మందికి లక్షా 93వేల రూపాయల విలువైన చెక్కులను అందజేశారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు శ్రీరామ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ పేదల ఆరోగ్యం విషయంలో ప్రభుత్వం ఎంతో ఖర్చు చేస్తోందన్నారు. గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన ఆరోగ్యశ్రీ బిల్లులను కూడా చంద్రబాబు నాయకత్వంలోనే ప్రభుత్వం చెల్లించిందన్నారు. ఇటు ఆరోగ్య శ్రీ వర్తించక ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆపరేషన్లు చేయించుకున్న వారికి సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందిస్తున్నారన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో మంచి మనసుతో స్పందిస్తున్నారని శ్రీరామ్ అన్నారు. పార్టీలకతీతంగా సాయం అందిస్తున్న గొప్ప నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు అని కొనియాడారు.

# అందరి కర్తవ్యం.. రక్షణ దళాలకు సంఘీభావం

**- దేశ రక్షణ నిధికి ఒక నెల జీతం విరాళం, ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మురళీనాయక్ చిత్రపటానికి ఘన నివాళులు**

మడకశిర, (చైతన్యరథం): దాయాది దేశం పాకిస్తాన్ తో జరుగుతున్న యుద్ధంలో వీరోచితంగా పోరాడుతున్న భారత రక్షణ దళాలకు సంఘీభావం తెలపడం, భారతీయులుగా ప్రతి పౌరుని కర్తవ్యం అని మడకశిర శాసనసభ్యులు, టీటీడీ పాలకమండలి సభ్యులు ఎం.ఎస్.రాజు అన్నారు. కేంద్ర రక్షణ నిధికి తన వంతుగా ఒక నెల జీతాన్ని విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించారు.



మడకశిరలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ నుండి డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ సర్కిల్ వరకు మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖలకు సంబంధించిన ఉద్యోగులతో కలిసి జాతీయ జెండాను చేతబట్టి ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన మురళీనాయక్ చిత్రపటానికి ఘన నివాళులు అర్పించి, సెల్యూట్ చేసిన అనంతరం మీడియాతో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్‌లో పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో వీరమరణం పొందిన ఆర్మీ జవాన్ మురళీనాయక్ అనంతపురం జిల్లాకు చందిన వ్యక్తి కావడం ఎంతో గర్వంగా ఉందని, దేశ రక్షణలో మా ప్రాంతానికి చెందిన వ్యక్తి ఉండడం ఈ ప్రాంతానికి గర్వకారణమని తెలిపారు. మురళీనాయక్ కుటుంబానికి ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా నిలిచాయన్నారు. గవర్నర్, ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు అందరూ మురళీనాయక్ కుటుంబానికి అండగా నిలబడ్డారని తెలిపారు. రానున్న కాలంలో కేంద్ర బలగాలు చేసే యుద్ధానికి ప్రతి ఒక్కరూ అండగా, సంఘీభావంగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వీరజవాను మురళీనాయక్‌కు ఘనంగా నివాళులు

**టీడీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి**



కర్నూలు, (చైతన్యరథం0: జమ్ముకాశ్మీర్‌లో విధులు నిర్వహిస్తున్న శ్రీసత్యసాయి జిల్లా, గోరంట్ల మండలం, కల్లితండాకు చెందిన జవాను మురళీనాయక్ సరిహద్దులో పాకిస్తాన్ సైన్యం జరిపిన కాల్పుల్లో వీరమరణం పొందారు. శనివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయం, కర్నూలులో జిల్లా తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వీరజవాను మురళీనాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

**అమరజవాను ఆఖరి చూపు కోసం వందకార్లలో**

## భారీ జనంతో తరలి వెళ్లిన కదిరి ఎమ్మెల్యే

కదిరి, (చైతన్యరథం): భారత్- పాక్ సరిహద్దుల్లో జరిగిన యుద్ధంలో వీరమరణం పొందిన శ్రీ సత్య సాయి జిల్లా గోరంట్ల మండలం కల్లి తండాకు చెందిన వీర జవాన్ కడసారి చూపు కోసం కదిరి నియోజవర్గం నుండి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్



ఆధ్వర్యంలో దాదాపు 100 వాహనాల్లో టీడీపీ శ్రేణులు ప్రజలు భారీగా తరలి వెళ్లారు. భారత ముద్దుబిడ్డ వీర జవాన్ మురళి నాయక్‌కు నివాళులర్పించేందుకు నియోజకవర్గ వ్యాప్తంగా పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. భారత్ మాతాకు జై... అమర్ హై మురళి నాయక్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేయడంతో కదిరి పట్టణం మారుమోగింది. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వీర జవాన్ అంతిమయాత్రలో పాల్గొనేందుకు వేలాదిగా తరలి వెళ్లారు.

## విరాళంగా ఒక నెల వేతనం

**ఎమ్మెల్యే అమిలినేని**

కళ్యాణదుర్గం, (చైతన్యరథం): యుద్ధలో వీరమరణం పొందిన భారత ఆర్మీ జవాన్ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లితాండా వాసి మురళి నాయక్ వీరమరణం పొంది చిత్రపటానికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. భారతదేశ రక్షణలో అసువులు బాసిన వీర జవాన్ కుటుంబానికి తన వంతుగా ఒక నెల వేతనం 1.75 లక్షల రూపాయలు అందిస్తానని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# వైభవంగా చెన్నకేశవుని రథోత్సవం

**యుద్ధంలో సైనికులకు స్వామి ఆశీస్సులు ఉండాలని కోరుకున్న శ్రీరామ్**

ధర్మవరం, (చైతన్యరథం): పట్టణంలో శనివారం జరిగిన శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మరథోత్సవంలో తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ పాల్గొన్నారు. స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం



పరిటాల శ్రీరామ్ స్థానిక టీడీపీ నాయకులతో కలసి స్వామి వారిని దర్శించుకున్నారు. రథోత్సవం నిర్వాహకులు శ్రీరామ్ కు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం శ్రీరామ్ స్వామివారికి వస్త్రాలు, పూలు, పండ్లు సమర్పించారు. రథంలో కొలువు దీరిన స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం అర్చకులు ఆశీర్వచనాలు అందజేశారు. భక్తులను పలుకరిస్తూ శ్రీరామ్ ముందుకు సాగారు. ఈసందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ ధర్మవరం ప్రజలపై స్వామి వారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. ధర్మవరంలో చేనేతలకు వ్యాపారం బాగా జరగాలని కోరుకున్నారు. ప్రస్తుతం ఇండియా పాకిస్తాన్ మధ్య యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో మన సైనికులకు స్వామివారి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నారు యుద్ధంలో భారత్ కు విజయాన్ని ప్రసాదించాలని స్వామివారిని ప్రార్థించినట్లు చెప్పారు. రథోత్సవంలో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చిన నేపథ్యంలో సంయమనంతో ఉండాలని నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.


చైతన్యరథం




ఇకపై ఉగ్రదాడులను..

## యుద్ధంగానే పరిగణిస్తాం
# భారత్ గట్టి హెచ్చరిక

### - ప్రధాని మోదీ అధ్యక్షతన ఉన్నతస్థాయి సమావేశంలో నిర్ణయం



న్యూఢిల్లీ: ఉగ్రవాదులు, వారికి మద్దతు పలికే వారికి భారత్ తాజాగా గట్టి హెచ్చరిక చేసింది. దేశంలో ఇక నుంచి ఎటువంటి ఉగ్రదాడులు జరిగినా వాటిని 'యుద్ధ చర్యగానే పరిగణిస్తామని స్పష్టం చేసింది. అందుకు తగు విధంగా స్పందిస్తామని భారత ప్రభుత్వం నిర్ణయించినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. భారత్-పాక్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న వేళ ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. పాకిస్థాన్ రెచ్చిపోతే అంతకు అంత ప్రతిదాడితో విరుచుకుపడాలని నిర్ణయించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన త్రివిధ దళాధిపతులతో జరిపిన అత్యున్నత స్థాయి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇకపై ఏ ఉగ్రదాడినైనా యుద్ధ చర్యగా పరిగణించాలని, అంతే తీవ్ర స్థాయిలో బదులివ్వాలని ప్రధాని దిశానిర్దేశం చేశారని తెలిసింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ అనిల్ చౌహాన్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ ఈ కీలక సమావేశంలో పాల్గొన్నారు.

భారత్‌లో 26 లొకేషన్లపై పాక్ డ్రోన్ దాడులకు ప్రతిగా శనివారం తెల్లవారు జామున నాలుగు పాక్ ఎయిర్‌బేస్‌లపై భారత్ దాడులు చేసింది. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ ఈ సమావేశం నిర్వహించారు. దేశ భద్రతా విషయంలో మరింత కఠిన వైఖరి ప్రదర్శించాలని ఈ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. భారత ప్రయోజనాలను దెబ్బతీసేలా భవిష్యత్తులో ఎలాంటి ఉగ్రవాద చర్యలకు పాల్పడినా దానిని యుద్ధచర్యగా పరిగణించాలని సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నట్లు ఆ వర్గాలు వెల్లడించాయి. దీంతో ఇకపై ఉగ్రవాద చర్యలను కేవలం అంతర్గత భద్రతా చర్యలుగానే పరిగణించలేమని, ప్రతిస్పందన అత్యంత భీకరంగా ఉంటుందనే ప్రత్యక్ష హెచ్చరిక సందేశాన్ని భారత్ ఇచ్చినట్లయింది.

ఈ ఉన్నతస్థాయి సమావేశానికి కొన్ని గంటల ముందే భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ సైతం ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. భారత్ - పాక్‌ల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో దోవల్ వరుసగా ప్రధానితో చర్చలు జరుపుతున్నారు. ఏప్రిల్ 22న పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడితో భారత్, పాక్‌ల మధ్య ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఈ క్రమంలోనే 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాక్‌లోని తొమ్మిది ఉగ్రస్థావరాలపై భారత్ ఆర్మీ దాడులు చేసింది. ఈ దాడుల్లో వందకు పైగా ఉగ్రవాదులు మృతిచెందారు. దాంతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి.

# పాక్ చర్యల వల్లే ఉద్రిక్తతలు

### - భారత ప్రతినిధుల స్పష్టీకరణ



న్యూఢిల్లీ: పాకిస్థాన్ చర్యల వల్లే సరిహద్దు వద్ద ఉద్రిక్తతలు నెలకొన్నాయని విదేశాంగ కార్యదర్శి విక్రం మిస్రి తెలిపారు. పాకిస్థాన్ చర్యలకు తగిన రీతిలో భారత్ స్పందిస్తున్నట్లు ఆయన చెప్పారు. అదే సమయంలో ఉద్రిక్తతలను తగ్గించేందుకు భారతీయ సైనిక బలగాలు కట్టుబడి ఉన్నాయన్నారు. ఆపరేషన్ సిందూర్ గురించి రక్షణ శాఖ శనివారం మీడియా సమావేశం నిర్వహించింది. విక్రం మిస్రితో పాటు కల్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వోమికా సింగ్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. శుక్రవారం రాత్రి నుంచే సరిహద్దు రాష్ట్రాల్లో కొన్నిచోట్ల బాంబుపేలుళ్లు వినిపించడంతో అధికారులు అప్పటికప్పుడు విద్యుత్తు సరఫరా నిలిపివేసి బ్లాకౌట్ పాటించారు. శ్రీనగర్, పఠాన్ కోట్ ప్రాంతాల్లో ఉదయం కూడా పేలుళ్ల శబ్దాలు వచ్చినట్లు స్థానికులు పేర్కొన్నారు. కాగా పాక్ దాడులను భారత్ సమర్థంగా తిప్పికొట్టింది. సరిహద్దు ప్రాంతాల్లో అధికారులు సైరన్లు మోగిస్తూ ప్రజలను అప్రమత్తం చేశారు. మధ్యాహ్నం 11 గంటల ప్రాంతంలో మరోసారి శ్రీనగర్ ఎయిర్ పోర్ట్ సమీపంలో భారీగా పేలుళ్ల సంభవించినట్లు శబ్దాలు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు.

శనివారం తెల్లవారుజామున పంజాబ్‌లోని పఠాన్‌కోట్ ఎయిర్ బేస్‌పై పాక్ దాడి చేసిందని, ఆ దాడి కోసం హై స్పీడ్ మిస్సైళ్లను పాక్ వాడినట్లు సోఫియా తెలిపారు. శ్రీనగర్, అవంతిపుర, ఉద్దంపూర్‌లో ఉన్న వైద్య కేంద్రాలపై పాకిస్థాన్ దాడి చేసినట్లు ఆమె తెలిపారు. పంజాబ్‌పై హైస్పీడ్ మిస్సైల్‌ను పాకిస్థాన్ ప్రయోగించినట్లు కల్నల్ సోఫియా వెల్లడించారు. పాకిస్తాన్ తమ సైనిక బలగాలను బోర్డర్ దిశగా కదిలిస్తోందని ఆమె పేర్కొన్నారు. పశ్చిమ బోర్డర్‌లో ఉన్న భారతీయ సైనిక కేంద్రాలపై డ్రోన్లు, లాంగ్ రేంజ్ వెపన్స్, అమ్యునిషన్స్, జెట్స్‌ను పాక్ వినియోగిస్తోందని ఖురేషీ చెప్పారు. పాకిస్థాన్ కవ్వింపులకు బదులుగా ఆ దేశ మిలిటరీ క్షేత్రాలను మాత్రమే టార్గెట్ చేసి.. ఇండియన్ ఆర్మీ అటాక్ చేసినట్లు వింగ్ కమాండర్ వోమికా సింగ్ తెలిపారు. పాకిస్థాన్ దుష్ప్రచారం చేస్తున్నట్లు ఆమె చెప్పారు. క్షిపణి రక్షణ వ్యవస్థ ఎస్-400 ధ్వంసమైనట్లు వస్తున్న వార్తలు నిజంకాదన్నారు. భారతీయ సైనిక బలగాలు నిత్యం సంసిద్ధతతో ఉన్నామని, అన్ని దాడులకు దీటైన జవాబు ఇస్తున్నామని వ్యోమిక చెప్పారు.

## పాక్ దాడుల్లో మృతుల కుటుంబాలకు
# రూ.10 లక్షల పరిహారం



శ్రీనగర్: జమ్మూకశ్మీర్ సరిహద్దు ప్రాంతాలపై పాక్ జరుపుతున్న దాడుల్లో దాదాపు 20మంది పౌరులు మృతి చెందిన విషయం తెలిసిందే. మృతుల కుటుంబాలకు జమ్మూ కశ్మీర్ ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా నష్టపరిహారం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం అందిస్తామని తెలిపారు. బాధిత కుటుంబాలకు తమ ప్రభుత్వం ఎప్పటికీ మద్దతుగా నిలుస్తుందని హామీ ఇచ్చారు.

పహల్గాం దాడికి ప్రతీకారంగా పాకిస్తాన్, పీవోకేల్లోని ఉగ్రస్థావరాలను భారత్ ధ్వంసం చేయడంతో.. పాక్ కూడా సరిహద్దు ప్రాంతాల్లో ప్రతీకార దాడులకు పాల్పడుతోంది. నియంత్రణ రేఖ వెంట పాక్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి దాడులకు తెగబడుతోంది. కశ్మీర్లోని శ్రీనగర్, రాజౌరి, పూంచ్, పఠాన్ కోట్ ప్రాంతాల్లో పాక్ డ్రోన్లతో దాడులు చేస్తోంది. ఈ దాడుల్లో జమ్మూకశ్మీర్ ప్రభుత్వ అధికారి రాజ్‌కుమార్ థప్పా సహా దాదాపు 20 మంది పౌరులు ప్రాణాలు కోల్పోగా.. పదుల సంఖ్యలో గాయపడ్డారు. పౌరులు, ప్రభుత్వ ఉన్నతాధికారి మృతి పట్ల జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కరోజు ముందే తాను నిర్వహించిన ఆన్‌లైన్ సమావేశంలో రాజ్‌కుమార్ పాల్గొన్నారని.. ఇంతలోనే రాజౌరిలోని ఆయన ఇంటిపై జరిగిన దాడిలో ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని అన్నారు.

## ఆపరేషన్ సిందూర్‌లో టాప్ టెర్రరిస్టులు హతం



న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడికి భారత్ గట్టిగా బదులు తీర్చుకుంది. లష్కరే తయ్యిబా, జైషే మహమ్మద్ ఉగ్రమూరాలే లక్ష్యంగా వాటి స్థావరాలపై బాంబులతో విరుచుకుపడింది. మే 7వ తేదీన అర్ధరాత్రి దాటిన తర్వాత పాక్, పీఓకేల్లో జరిపిన మెరుపు దాడుల్లో తొమ్మిది కీలక ఉగ్ర శిబిరాలను నేలమట్టం చేసింది. ఈ 'ఆపరేషన్ సిందూర్'లో 100 మందికి పైగా ఉగ్రవాదులు హతమైనట్లు ఇటీవల కేంద్రం వెల్లడించిన సంగతి తెలిసిందే. ఇందులో ఐదుగురు కీలక ఉగ్ర నాయకులను కూడా మట్టుబెట్టి నట్లు తెలుస్తోంది. వారి వివరాలు తాజాగా వెల్లడయ్యా యి. జైషే మహమ్మద్ వ్యవస్థాపకుడు మసూద్ అజార్ ఇద్దరు బావమరుదులతో పాటు లష్కరే తయ్యిబా ముఠాకు చెందిన కీలక ఉగ్రవాది, మరో ఇద్దరు ముష్కరులు హతమైనట్లు తెలుస్తోంది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలు వెల్లడించినట్లుగా పేర్కొంటూ ఆంగ్ల మీడియాలో ఓ జాబితా బయటికొచ్చింది.

**1. ముదస్సర్ ఖదాయిన్ ఖాస్ అలియాస్ అబు జుండాల్**

ఇతడు లష్కరే తయ్యిబా ముఠాకు చెందిన కీలక ఉగ్రవాది. ఇతడి అంత్యక్రియలను పాక్ ఆర్మీ లాంఛనాలతో నిర్వహించినట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ ఉగ్రవాది హఫీజ్ అబ్దుల్ రౌఫ్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి పాక్ ఆర్మీ చీఫ్, పంజాబ్ (పాక్‌లోని) సీఎం, ఐజీ పాల్గొన్నట్లు సమాచారం.

**2. హఫీజ్ మహమ్మద్ జమీల్**

జైషే మహమ్మద్ ఉగ్ర ముఠాలోని కీలక సభ్యుడు, ఆ సంస్థ వ్యవస్థాపకుడు మసూద్ అజార్‌కు పెద్ద బావమరిది.

**3. మహమ్మద్ యూసఫ్ అజార్ అలియాస్ ఉస్తాద్ జీ అలియాస్ సలీమ్ అలియాస్ సాహబ్**

జైషే ముఠాకు చెందిన మరో కీలక ఉగ్రవాది ఇతడు. మసూద్ అజార్ మరో బావమరిది అయిన అజార్.. ఐసీ-814 విమాన హైజాక్ ఘటనలో ప్రధాన నిందితుడిగా ఉన్నాడు.

**4. ఖలీద్ అలియాస్ అబు అకాస**

లష్కరే తయ్యిబాకు చెందిన టాప్ ఉగ్రవాది. జమ్మూకశ్మీర్లో పలు ఉగ్రదాడులకు నేతృత్వం వహించాడు. అఫ్గానిస్థాన్ నుంచి ఆయుధాల స్మగ్లింగ్ చేసేవాడు. ఫైసలాబాద్లో జరిగిన ఇతడి అంత్యక్రియలకు పాక్ లోని సీనియర్ ఆర్మీ అధికారులు, స్థానిక డిప్యూటీ కమిషనర్ హాజరైనట్లు సమాచారం.

**5. మహమ్మద్ హసన్ ఖాన్**

జైషే మహమ్మద్ ముఠాలో కీలక సభ్యుడు. పాక్ ఆక్రమిత కాశ్మీర్లోని జైషే ఆపరేషనల్ కమాండర్ ముఫ్తి అస్గర్ ఖాన్ కశ్మీరీ కుమారుడు. జమ్మూకశ్మీర్లోకి ఉగ్రవాదులను పంపించడంలో కీలక పాత్ర పోషించాడు.

జైషే, లష్కరే ముఠాల కీలక స్థావరాలే లక్ష్యంగా భారత్ ఈ మెరుపుదాడులు చేపట్టిన సంగతి తెలిసిందే. భారత్ టార్గెట్ చేసిన వాటిల్లో., లాహోర్‌కు 40 కిలోమీటర్ల దూరంలోని మురిద్కేలో గల లష్కరే తోయిబా ఉగ్ర శిబిరం కూడా ఉంది. ఇక్కడ 26/11 ముంబయి దాడులకు పాల్పడిన ఉగ్రవాదులు అజ్మల్ కసబ్, డేవిడ్ హెడ్లీ శిక్షణ తీసుకున్నారు. ఇక, జైషేకు చెందిన ప్రధాన కేంద్రం బహవల్‌పూర్ లోని మర్కజ్ సుబాన్‌పైనా దాడి జరిగింది. ఈ దాడిలో మసూద్ అజార్ కుటుంబంలోని 10 మంది మృతిచెందినట్లు వార్తలు వచ్చాయి.

# పాక్‌పై బలోచ్ పిడుగు!

### 39 ప్రాంతాల్లో బీఎల్‌ఏ మెరుపుదాడులు - మంగోచర్ పట్టణం స్వాధీనం



ఒకపక్క భారత్ చేతిలో భంగపాటుకు గురవుతున్న పాకిస్థాన్‌కు మరో పక్కనుంచి బలోచ్ లిబరేషన్ ఆర్మీ మంటపెడుతోంది. భారత్‌ను రెచ్చగొడుతూ చావుదెబ్బ తింటున్న పాకిస్థాన్ నెత్తిన మరో పిడుగు పడింది. దశాబ్దాలుగా ఆ దేశానికి కొరకరాని కొయ్యగా మారిన బలోచిస్థాన్ వేర్పాటువాద ఉద్యమం.. తాజా ఉద్రిక్తతల వేళ మరింత తీవ్రమైంది. తాజాగా అక్కడ ఓ పట్టణాన్ని బలోచ్ లిబరేషన్ ఆర్మీ స్వాధీనం చేసుకోవడంతో పాకిస్థాన్‌కు స్వదేశంలోనే సవాల్ ఎదురైంది.

పాక్ ఆర్మీపై బలోచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్‌ఏ) విరుచుకుపడింది. బలోచిస్థాన్ ప్రావిన్స్‌లోని కాలత్ జిల్లా మంగోచర్ పట్టణాన్ని తాము స్వాధీనం చేసుకున్నట్లు బీఎల్‌ఏ శనివారం ప్రకటించింది. అంతేగాక, బలోచిస్థాన్ వ్యాప్తంగా 39 ప్రాంతాల్లో మెరుపు దాడులు చేశామని వెల్లడించింది. ఈ దాడులకు పాకిస్థాన్ సైనిక స్థావరాలు, గ్యాస్ పైప్‌లైన్లు, ప్రధాన రహదారులు లక్ష్యంగా మారినట్లు సమాచారం. ఈ ఆపరేషన్ ఇంకా కొనసాగుతోందని, మిలిటరీ కాన్వాయ్లపై దాడులు చేస్తామని హెచ్చరించింది. ఇప్పటికే కొంతమంది స్థానిక పోలీసులను బీఎల్‌ఏ బందీలుగా తీసుకున్నట్లు తెలుస్తోంది. పోలీసు స్టేషన్‌ను తమ నియంత్రణలోకి తీసుకున్న బీఎల్‌ఏ .. రహదారులను దిగ్బంధించింది.

అయితే, బలోచ్ రెబల్స్ ప్రకటనపై పాక్ ప్రభుత్వం నుంచి ఇంకా అధికారిక ప్రకటన రాలేదు. ఇదిలా ఉండగా.. శుక్రవారం కూడా పాక్ ఆర్మీ సిబ్బందిపై బీఎల్‌ఏ తిరుగుబాటుదారులు దాడి చేయగా.. 22 మంది సైనికులు మరణించినట్లు వార్తలు వచ్చాయి. భారత్‌తో ఉద్రిక్తతలు కొనసాగుతున్న సమయంలో.. బలోచ్‌లో ఈ ఘటనలు చోటుచేసుకోవడం పాకు ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

పాకిస్థాన్లోని బలోచిస్థాన్ ప్రావిన్సులో చమురు, బొగ్గు, బంగారం, రాగి, సహజ వాయువు తదితర వనరులు పుష్కలంగా ఉన్నాయి. వీటి ఆదాయం పాక్ ఖజానా నింపుతోంది. వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని స్థానిక ప్రజలకు చెందకుండా పాక్ సైనిక ప్రభుత్వ వ్యవస్థ కబ్జా చేసిందనేది బలోచిస్థాన్ ప్రజల ఆరోపణ. దేశ వ్యవసాయ యోగ్య భూమిలో ఆ రాష్ట్ర వాటా కేవలం 5 శాతం మాత్రమే. అక్కడ కఠినమైన ఎడారి వాతావరణం ఉంటుంది. పేదరికం కూడా ఎక్కువే. జనాభా తక్కువగా ఉండటంతో అభివృద్ధికి దూరమైంది. పాకిస్థాన్ పాలకులు ఈ ప్రాంతంపై పూర్తిగా నిర్లక్ష్యం చూపిస్తున్నారు. ఫలితంగా రాజకీయ అనిశ్చితి నెలకొని.. వేర్పాటువాదులు శక్తిమంతమయ్యారు. ప్రత్యేక దేశంగా ఏర్పడాలని ఇక్కడి ప్రజలు కొన్ని దశాబ్దాలుగా పోరాడుతున్నారు. వేర్పాటు వాద భావాలను అణచివేసేందుకు పాక్ సైన్యం ఐఎస్ఐ వంటి సంస్థల ద్వారా బీఎల్‌ఏపైన తీవ్ర హింసకు పాల్పడుతోంది. ఈ పోరులో వేలాది మంది యువకులు గల్లంతైన పరిస్థితులు ఉన్నాయి.

బలోచిస్థానీలు తమకు ప్రత్యేక దేశం కావాలని డిమాండ్ చేస్తున్నారు. పాకిస్థాన్ జాతీయ సమైక్యతకు ఇది ప్రమాదకరమనే భావంతో అక్కడి ప్రభుత్వం, సైన్యం బలోచిస్థాన్ ఉద్యమాలపైన నిర్దాక్షిణ్యంగా వ్యవహరిస్తోంది. పాకిస్థాన్ నుంచి పూర్తిస్థాయి స్వతంత్ర బలోచిస్థాన్ ఏర్పాటు చేయడమే బీఎల్‌ఏ లక్ష్యం. బలోచిస్థాన్ లిబరేషన్ ఆర్మీకి అక్కడి ప్రజలు పూర్తిగా మద్దతు ఇస్తున్నారు.

# ఉద్రిక్తతలు తగ్గించుకోండి

### - భారత్, పాక్‌లకు అమెరికా, జీ 7 దేశాల హితవు

భారత్, పాకిస్తాన్ దేశాల మధ్య యుద్ధ నివారణకు ప్రపంచ దేశాలు ముందుకొస్తున్నాయి. ఇందులో భాగంగా ఇరు దేశాలు నిర్మాణాత్మక చర్చలు ప్రారంభించాలని అమెరికా, జీ 7 దేశాలు కోరాయి. ఇందుకోసం తాము సహాయం అందిస్తామని ప్రకటించాయి.



పరిస్థితులు మరింత తీవ్రతరం కాకముందే భారత్‌తో తక్షణం చర్చలు జరపాలని పాకిస్థాన్‌కు అమెరికా సూచనలు చేసింది. పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ తో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఫోన్లో మాట్లాడినట్లు ఆ దేశ విదేశాంగ ప్రతినిధి వెల్లడించారు. భారత్– పాక్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో వీరు మాట్లాడుకోవడం గమనార్హం. పెరుగుతున్న సైనిక ఉద్రిక్తతలను తగ్గించడానికి తక్షణం చర్యలు తీసుకోవాలని పాకిస్థాన్‌కు రూబియో సూచించారని విదేశాంగశాఖ తెలిపింది. ఉద్రిక్తతలు మరింత తీవ్రతరం కాకుండా ఉండేందుకు అవసరమైతే ఇరు దేశాల మధ్య తాము మధ్యవర్తిత్వం చేస్తామని ప్రతిపాదించినట్లు వెల్లడించింది. ఇదిలాఉండగా.. భారత విదేశాంగ మంత్రి జై శంకర్ తోనూ రూబియో ఫోన్లో మాట్లాడారు. భారత్– పాక్ ల మధ్య ఉద్రిక్తతలు సద్దుమణిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని రూబియో సూచించారు. ఇరుదేశాల మధ్య వివాదాల ముగింపునకు చర్చలు జరపాలని, అందుకు అమెరికా పూర్తి సాయం అందిస్తుందని తెలిపారు. ఈ ఫోన్ కాల్ విషయాన్ని జై శంకర్ స్వయంగా ధ్రువీకరించారు. ఈ సందర్భంగా భారత్ విధానం ఎప్పుడూ బాధ్యతాయుతంగానే ఉంటుందని స్పష్టం చేశారు.

మరోవైపు, ఏప్రిల్ 22న కశ్మీర్‌లో జరిగిన ఇస్లామిక్ ఉగ్రవాద దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, అమెరికా, బ్రిటన్ (జీ 7) సహా యూరోపియన్ యూనియన్ విదేశాంగ మంత్రులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇరుదేశాలు‘ఉద్రిక్తతలను వెంటనే తగ్గించాలని, శాంతియుత పరిష్కారం కోసం రెండు దేశాలు ప్రత్యక్ష చర్చల్లో పాల్గొనాలని పిలుపునిస్తున్నామని జీ 7 అగ్ర దౌత్యవేత్తలు ప్రకటించారు. దశాబ్దాల నాటి భారత్–పాకిస్తాన్ శత్రుత్వం తార స్థాయికి చేరడం మంచిది కాదని, నిర్మాణాత్మక శాశ్వత పరిష్కార చర్యలు తీసుకోవాలని కూడా జీ7 దేశాలు చెప్పాయి.

# నిర్మాణాత్మక పాత్ర పోషిస్తాం: చైనా

భారత్– పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలకు ముగింపు పలికేందుకు అవసరమైతే నిర్మాణాత్మక పాత్ర పోషిస్తామని చైనా పేర్కొంది. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో చైనా ఈమేరకు పేర్కొనడం గమనార్హం. ఇరుదేశాలు సంయమనం పాటించాలని చైనా విదేశాంగ శాఖ శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. భారత్– పాక్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తత పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నాం. శాంతి, స్థిరత్వం కోసం ఇరుదేశాలు సమయమనం పాటించాలని కోరుతున్నాం. శాంతియుత మార్గాలతో సమస్యలను పరిష్కరించుకోవాలి. ఉద్రిక్తతలను తీవ్రతరం చేసే చర్యలను తగ్గించుకోవాలని సూచిస్తున్నాం. ఈ ఉద్రిక్తతలను తగ్గించాలని అంతర్జాతీయ సమాజం కూడా ఆశిస్తోంది. ఈ సమస్య ముగింపునకు అవసరమైతే నిర్మాణాత్మక పాత్ర పోషించేందుకు మేము సిద్ధంగా ఉన్నామని చైనా పేర్కొంది.



# ఇక చాలు.. దాడులు ఆపేద్దాం

### - పాక్ విదేశాంగ మంత్రి



వరుస చావుదెబ్బలతో పాకిస్థాన్ స్వరంలో మార్పు వచ్చింది. ఇన్నాళ్లూ.. భారత్ తమపై దాడి చేస్తే ఎదురుదాడికి దిగుతామని మేకపోతు గాంభీర్యం ప్రదర్శించిన పాక్ ఇప్పుడు మాట మార్చేసింది. పాక్ విదేశాంగ శాఖ మంత్రి ఇషాక్ దార్ మీడియాతో మాట్లాడుతూ.. భారత్ తమపై చేస్తున్న సైనిక దాడిని ఇక్కడితో ఆపితే తాము కూడా ఉద్రిక్తతలు తగ్గించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఇరుదేశాల మధ్య దాడుల వల్ల పాక్ ఆర్థిక పరిస్థితి కుదేలవ్వడం, ప్రజల పరిస్థితులు అధ్వానంగా మారే ప్రమాదం ఉండడంతో.. ఈ యుద్ధ వాతావరణాన్ని రూపుమాపడం కోసం భారత్‌తో చర్చలు జరపడానికి పాకిస్థాన్ సిద్ధంగా ఉందని ఆ దేశ అధికారిక వర్గాలు వెల్లడించాయి. భారత్–పాక్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో పరిస్థితులు చేయి దాటకముందే దాడుల నివారణకు చర్యలు తీసుకోవాలని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఇరుదేశాలకు సూచించారు. ఈ నేపథ్యంలో పాక్ విదేశాంగశాఖ మంత్రి ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది.

# రక్షణ కవచాలుగా మదర్సా విద్యార్థులు

### - పాక్ రక్షణ మంత్రి సిగ్గుమాలిన ప్రకటన



పహల్గాం ఉగ్రదాడితో రెచ్చగొట్టిన పాకిస్థాన్, ఇప్పుడు భారత్ కన్నెర్ర చేయడంతో దిగ్గుతోచని పరిస్థితుల్లో పడింది. ఓవైపు ఆర్థిక వ్యవస్థ కుదేలయ్యిందంటూ ప్రపంచ దేశాల ముంగిట రుణాల కోసం వెంపర్లాడుతూ, ఉద్రిక్తతలు తగ్గించేందుకు ముందుగా భారత్ చొరవ తీసుకోవాలంటూ మోకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తోంది. మరోవైపు, సొంత పౌరుల ప్రాణాలు బలపెట్టేందుకు నిస్సిగ్గుగా సిద్ధమవుతోంది. భారత్‌పై ఇటీవల పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ఆ దేశ రక్షణ శాఖ మంత్రి ఖవాజా ఆసిఫ్ తాజాగా మరోసారి తన నీచ బుద్ధిని, చేతకానితనాన్ని చాటుకున్నారు. ఇందుకు నిస్సిగ్గుగా పార్లమెంటును వేదికగా చేసుకున్నారు.

అత్యవసర పరిస్థితులు తలెత్తితే మదర్సాలలో చదువుకునే విద్యార్థులను రెండవ రక్షణ కవచంగా ఉపయోగిస్తామని ఖవాజా ఆసిఫ్ పార్లమెంటులో ప్రకటించారు. మదర్సా విద్యార్థులు స్సందేహంగా ఈ దేశ రెండవ రక్షణ కవచాలు. అక్కడ చదువుకుంటున్న యువకులు వారు. సమయం వచ్చినప్పుడు వారిని 100 శాతం ఉపయోగించుకుంటా మని అని ఆసిఫ్ వ్యాఖ్యానించారు. పహల్గాం ఉగ్రదాడులకు ప్రతిగా ఆపరేషన్ సిందూర్ పేరుతో పీఓకేలోని 26 ఉగ్రస్థావరాలపై భారత బలగాలు విరుచుకుపడి 100 మందికి పైగా ఉగ్రవాదులను మట్టుబెట్టిన నేపథ్యంలో పాక్ పార్లమెంటులో ఆసిఫ్ ఈ వ్యాఖ్యలు చేసారు. చదువుకుంటున్న విద్యార్థులను రక్షణ కవచాలుగా వాడుకుని వారి ప్రాణాలను పణంగా పెడతామంటూ వ్యాఖ్యలు చేసిన అసిఫ్ వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## భారత్-పాక్ కాల్పుల విరమణతో

# ఐపీఎల్ పునఃప్రారంభానికి నేడు బీసీసీఐ కీలక సమావేశం



భారత్, పాకిస్థాన్‌ల మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో మే 8న ధర్మశాలలో జరగాల్సిన మ్యాచ్‌ను అర్ధంతరంగా నిలిపివేసిన సంగతి తెలిసిందే. తర్వాత ఐపీఎల్‌ను వారం రోజులు వాయిదా వేసింది. తాజాగా కాల్పుల విరమణకు భారత్, పాకిస్థాన్ అంగీకరించడంతో ఐపీఎల్ పునఃప్రారంభానికి మార్గం సుగమమైంది.

'శనివారం సాయంత్రం 5గంటల నుంచి భారత్, పాకిస్థాన్ కాల్పుల విరమణ పాటించనున్నాయి' అని మధ్యవర్తిత్వం వహించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఇరు దేశాలూ ఈ విషయాన్ని ధ్రువీకరించాయి. దీంతో ఐపీఎల్ పునఃప్రారంభంపై క్రికెట్ అభిమానుల్లో ఆశలు చిగురించాయి. సరిహద్దులకు దూరంగా దక్షిణ భారతదేశంలోని బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ వేదికగా మ్యాచ్‌లు నిర్వహించే అవకాశం ఉందని కాల్పుల విరమణ ప్రకటనకు ముందే వార్తలు వచ్చాయి. తాజా పరిణామాల నేపథ్యంలో ఐపీఎల్లో ఇంకా మిగిలి ఉన్న 16 మ్యాచ్‌ల నిర్వహణ విషయమై నేడు బీసీసీఐ కీలక సమావేశం నిర్వహించనుంది. వీలైనంత త్వరగా ఐపీఎల్ మ్యాచ్‌ల పునఃప్రారంభంపై ఈ సమావేశంలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

# విదేశీ ఆటగాళ్ల రాకపై సందిగ్ధత..



*ఐపీఎల్ 2025 సీజన్‌ను తాత్కాలికంగా నిలిపివేయడంతో ఆ సిరీస్‌లో పాల్గొన్న విదేశీ ఆటగాళ్లందరూ తమ స్వదేశాలకు తిరిగి వెళ్లిపోయారు. కానీ బీసీసీఐ ఈ విషయంలో అన్ని ఐపీఎల్ జట్లకు అలర్ట్ జారీ చేసింది. వారం రోజుల్లో ఐపీఎల్ పోటీలు తిరిగి ప్రారంభమయ్యే అవకాశం ఉందని.. దానికి అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని, సిద్ధంగా ఉండాలని సూచించారు. విదేశీ ఆటగాళ్లందరూ వారి స్వదేశాలకు తిరిగి రావడంతో కేవలం ఒక వారంలో వారిని భారత్‌కు తిరిగి తీసుకురావడం చాలా కష్టమే. దీనివల్ల ఐపీఎల్ జట్లలో గందరగోళం నెలకొంది.*

*ఆటగాళ్ల భద్రతను దృష్టిలో ఉంచుకుని.. దక్షిణ భారత నగరాల్లో మాత్రమే ఐపీఎల్ మ్యాచ్‌లను నిర్వహించాలని బీసీసీఐ తాత్కాలిక ప్రణాళికను రూపొందించినట్లు సమాచారం.*

*కోల్‌కతాతో సహా 5 నగరాలతో పాటు చెన్నై, హైదరాబాద్, విశాఖపట్నం, బెంగళూరు అనే 4 నగరాల్లో ఐపీఎల్ మ్యాచ్‌లను నిర్వహించాలని బీసీసీఐ తాత్కాలిక ప్రణాళికను రూపొందించింది. దీని ప్రకారం ఆటగాళ్ల భద్రతను నిర్ధారించవచ్చు. ఈ ప్లాన్ వెనుక ఉన్న ఆలోచన ఏమిటంటే.. విదేశీ ఆటగాళ్లు ఎటువంటి భయం లేకుండా ఐపీఎల్ ఆడడానికి తిరిగి రాగలరు.*

*ఇందులో మరో సమస్య ఉంది. ఐపీఎల్ సీజన్ వారం లోపు ప్రారంభం కాకపోతే మిగిలిన 16 ఐపీఎల్ మ్యాచ్‌లు వచ్చే సెప్టెంబర్ వరకు ఖచ్చితంగా జరగవు. ఎందుకంటే భారత జట్టు జూన్ రెండో వారం నుంచి ఇంగ్లాండ్‌లో టెస్ట్ సిరీస్‌లో పాల్గొనబోతోంది. అలా చేయడం వల్ల భారత్, ఇంగ్లాండ్ అంతర్జాతీయ మ్యాచ్ షెడ్యూల్‌లో గందరగోళం ఏర్పడుతుంది. దీనితో పాటు ఆసియా కప్ సిరీస్ సెప్టెంబర్‌లో జరగనుంది. అయితే ప్రస్తుతం ఆసియా కప్‌లో ప్రధాన జట్లుగా ఉన్న భారత్, పాకిస్థాన్ జట్టు మళ్లీ కలిసి ఆడే అవకాశం లేదు.*

*అలాగే పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీ ఆసియా క్రికెట్ కౌన్సిల్ అధ్యక్షుడుగా ఉన్నాడు. కాబట్టి ఆసియా కప్‌ను నిర్వహించడం సాధ్యం కాదు. ఆ సమయంలో ఐపీఎల్ సిరీస్‌లోని మిగిలిన మ్యాచ్‌లను నిర్వహించవచ్చు. కానీ విదేశీ ఆటగాళ్లు పాల్గొనడంలో గందరగోళం ఏర్పడుతుంది. అందువల్ల వీలైతే వచ్చే వారంలోపు ఐపీఎల్ సిరీస్ ను తిరిగి ప్రారంభించడానికి బీసీసీఐ ప్రయత్నాలు చేస్తోందని సమాచారం. అందుకు అన్ని ఐపీఎల్ జట్లను సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. కానీ విదేశీ ఆటగాళ్లను వెంటనే ఎలా పిలవాలనేది కూడా సవాలే.*

## టీమిండియా నూతన టెస్ట్ కెప్టెన్సీకి

# ముహూర్తం ఖరారు!




ఐపీఎల్ 2025 సమయంలో రోహిత్ శర్మ టెస్ట్ ఫార్మాట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించాడు. హిట్ మ్యాన్ సోషల్ మీడియాలో ఒక పోస్టును పంచుకోవడం ద్వారా తన రిటైర్మెంట్ ప్రకటించాడు. రోహిత్ శర్మ తర్వాత భారత టెస్ట్ జట్టుకు ఎవరు కెప్టెన్ అవుతారనేది ఇప్పుడు ఉన్న అతిపెద్ద ప్రశ్న. అయితే భారత టెస్ట్ జట్టుకు కొత్త కెప్టెన్‌ను ఎప్పుడు ప్రకటిస్తారు. దీనిపై తాజాగా కీలక అప్‌డేట్ వచ్చింది.

**కొత్త కెప్టెన్‌ను ఎప్పుడు ప్రకటిస్తారు?**

రోహిత్ శర్మ అకస్మాత్తుగా టెస్ట్ క్రికెట్‌కు తన రిటైర్మెంట్ ప్రకటించాడు. ఈ పరిస్థితిలో ఇప్పుడు బీసీసీఐ కొత్త కెప్టెన్‌ను ఎంపిక చేసుకోవాలి. క్రిక్ బజ్ నివేదిక ప్రకారం.. మే 23న కొత్త కెప్టెన్‌ను ప్రకటించనున్నట్లు తెలిసింది. కొత్త కెప్టెన్‌ను ప్రకటించడానికి బీసీసీఐ మీడియా సమావేశాన్ని కూడా ప్లాన్ చేసింది. ఐపీఎల్ 2025 తర్వాత భారత జట్టు ఇంగ్లాండ్‌లో పర్యటించనుంది. అక్కడ 5 మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ ఆడతారు. ఈ పర్యటనలో భారత జట్టుకు కొత్త టెస్ట్ కెప్టెన్ రాబోతున్నాడు. ఇంగ్లాండ్ పర్యటనకు జట్టును ఎంపిక చేసే ముందు కొత్త భారత టెస్ట్ కెప్టెన్‌ను ప్రకటిస్తారు.

**ముందంజలో గిల్**

రోహిత్ శర్మ తర్వాత శుభ్‌మన్ గిల్ భారత టెస్ట్ జట్టుకు నాయకత్వం వహించనున్నట్లు తెలుస్తోంది. గిల్ ఈ రేసులో ముందంజలో ఉన్నాడు. జస్‌ప్రీత్ బుమ్రా గురించి మాట్లాడుకుంటే.. బుమ్రా చాలా ముఖ్యమైన సిరీస్‌లు, టోర్నమెంట్లకు ముందు గాయం కారణంగా దూరమయ్యాడు. బుమ్రాకు తరచుగా గాయాల సమస్యలు ఉంటాయి. ఈ విషయంలో బుమ్రా కెప్టెన్సీ రేసులో చాలా వెనుకబడి ఉన్నాడు. కెప్టెన్ అయ్యే రేసులో గిల్ పేరు ముందంజలో ఉంది. శుభ్‌మన్ గిల్ భారత్ తరఫున టెస్ట్, వన్డే మ్యాచ్‌లు నిరంతరం ఆడుతున్నాడు.

**రిటైర్ కానున్న విరాట్ కోహ్లి!**

మీడియా నివేదికల ప్రకారం.. విరాట్ కోహ్లి టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్ కావాలని ఆలోచిస్తున్నాడు. దీని గురించి విరాట్ కోహ్లి బీసీసీఐతో కూడా మాట్లాడాడు. కానీ బీసీసీఐ, జట్టు యాజమాన్యం కొంత సమయం తీసుకుని జాగ్రత్తగా ఆలోచించమని కోహ్లికి సూచించినట్లు తెలుస్తోంది. విరాట్ కోహ్లి జట్టుకు చాలా ముఖ్యమైన ఆటగాడు కావడంతో ఇంగ్లాండ్ పర్యటనకు జట్టుతో వెళ్లాలని జట్టు యాజమాన్యం కోరుకుంటోంది. విరాట్ కోహ్లి ఇంతకు ముందు ఇంగ్లాండ్‌లో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లలో చాలా పరుగులు చేశాడు.

# టీమిండియా టెస్ట్ కెప్టెన్సీకి బుమ్రానే సరైనోడు



## *మాజీ క్రికెటర్ మదన్ లాల్*

టీమిండియా టెస్ట్ కెప్టెన్సీ బాధ్యతలను స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాకు ఇవ్వాలని మాజీ క్రికెటర్ మదన్ లాల్ అభిప్రాయపడ్డారు. సుదీర్ఘ ఫార్మాట్‌లో భారత జట్టును నడిపించే సత్తా అతనికే ఉందని, రోహిత్ శర్మ స్థానాన్ని అతను మాత్రమే భర్తీ చేయగలడని చెప్పాడు. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ టెస్ట్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. కేవలం వన్డే ఫార్మాట్‌లో మాత్రమే కొనసాగుతానని హిట్ మ్యాన్ తెలిపాడు.

ఇంగ్లండ్ పర్యటనకు ముందు రోహిత్ శర్మ రిటైర్మెంట్ ప్రకటించడంతో సెలెక్టర్ల సూచనల మేరకే అతను వీడ్కోలు పలికి ఉంటాడనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రోహిత్ శర్మ రిటైర్మెంట్‌ను స్వాగతించిన మదన్‌లాల్.. తదుపరి కెప్టెన్‌గా బుమ్రానే నియమించాలని సూచించారు. వైస్ కెప్టెన్‌గా కుర్రాళ్లకు అవకాశాలు ఇవ్వాలని చెప్పారు.

'టీమిండియా తదుపరి టెస్ట్ కెప్టెన్‌గా జస్ప్రీత్ బుమ్రాకు అవకాశం ఇవ్వాలి. అతనే సరైనోడు. ఫిట్‌నెస్ అనేది భిన్నమైన అంశం. బుమ్రా ఫిట్‌గా ఉండి అందుబాటులో ఉంటే మాత్రం టెస్ట్ కెప్టెన్సీకి అతనే సరైనోడు. వైస్ కెప్టెన్‌గా యువ ఆటగాళ్లను నియమించవచ్చు.'అని మదన్ లాల్ చెప్పుకొచ్చారు.

రోహిత్ శర్మ రిటైర్మెంట్ నిర్ణయాన్ని మదన్ లాల్ సమర్థించారు. పెద్ద ఆటగాళ్లు జట్టులోకి వచ్చినప్పుడు, వారికి మొదటి ప్రాధాన్యత లభిస్తుందని, అయితే ఫామ్ ఎప్పుడైనా మారవచ్చని ఆయన అన్నారు. రోహిత్ తన నిర్ణయం గురించి బాగా ఆలోచించే ఈ నిర్ణయం తీసుకొని ఉంటాడని అభిప్రాయపడ్డారు.

జస్‌ప్రీత్ బుమ్రా ఇప్పటి వరకు మూడు టెస్టుల్లో భారత జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించాడు. అందులో భారత్ ఒకటి గెలిచి మరో రెండింటిలో ఓడింది. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో బుమ్రా సారథ్యంలోనే టీమిండియా శుభారంభం చేసింది. అయితే ఈ సిరీస్‌లో ఎక్స్‌ట్రా ఎఫర్ట్ పెట్టి బౌలింగ్ చేయడం వల్ల ఆఖరి మ్యాచ్‌లో బుమ్రా వెన్ను గాయానికి గురయ్యాడు. ఈ గాయంతో సుదీర్ఘ కాలం జట్టుకు దూరంగా ఉన్నాడు.

ఈ గాయాల బెడదతోనే బుమ్రాను లీడర్‌షిప్ గ్రూప్ నుంచి తప్పించాలని సెలెక్టర్లు భావిస్తున్నట్లు తెలుస్తోంది. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా ఇంగ్లండ్‌తో ఐదు టెస్ట్‌ల సిరీస్‌లో బుమ్రా ఐదు మ్యాచ్‌లకు ఐదు ఆడలేని పరిస్థితి నెలకొంది. జూన్ 20 నుంచి టీమిండియా.. ఇంగ్లండ్ పర్యటన మొదలవ్వనుంది.

## రీ రిలీజ్‌లోనూ కలెక్షన్ల సునామీ

తొలి రిలీజ్‌లో కలెక్షన్ల సునామీ సృష్టించిన జగదేక వీరుడు అతిలోక సుందరి రీ రిలీజ్‌లోనూ అదరగొట్టింది. మెగాస్టార్ చిరంజీవి, శ్రీదేవి జంటగా నటించిన 'జగదేక వీరుడు అతిలోక సుందరి' చిత్రాన్ని మూడున్నర దశాబ్దాల తర్వాత మరోసారి చిత్ర నిర్మాత అశ్వినీదత్ రిలీజ్ చేశారు. దర్శకేంద్రుడు కె. రాఘవేంద్రరావు దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ సినిమా అప్పట్లో సోషియో ఫాంటసీ సినిమాల్లో ఓ ట్రెండ్ సెట్టర్‌గా మారింది. ఇప్పటి టెక్నాలజీకి అనుగుణంగా దీనిని అప్ డేట్ చేయడంతో పాటు 2డీ లోనే కాకుండా త్రీడీలోనూ వైజయంతి మూవీస్ సంస్థ విడుదల చేసింది. ఈ సినిమాకు రీ రిలీజ్‌లో మంచి ఓపెనింగ్స్ వచ్చాయి. ఈ సినిమా వరల్డ్ వైడ్‌గా తొలిరోజు రూ. 1.75 కోట్ల గ్రాస్ ను కలెక్ట్ చేసిందని అశ్వినీదత్ తెలిపారు.

శుక్రవారం విడుదలయిన సినిమాలన్నింటిలోకి చాలా కేంద్రాలలో 'జగదేక వీరుడు అతిలోక సుందరి' సినిమానే ఎక్కువ కలెక్షన్స్‌ను సాధించింది. 35 యేళ్ళ క్రితం ఈ సినిమా విడుదల సమయంలో తుఫాన్ వచ్చి ఆంధ్రప్రదేశ్ అల్లకల్లోలమైపోయింది. అలానే ఇప్పుడు కూడా సినిమా విడుదలకు సరిగ్గా రెండు రోజుల ముందు భారత్ – పాక్ మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలోనూ 'జగదేక వీరుడు – అతిలోక సుందరి' మూవీని ఫ్యామిలీస్‌తో కలిసి చాలామంది వీక్షించడం విశేషం.




## బ్లో అప్



మమితా బైజు

## చేతల మనిషి మోదీ..

ప్రముఖ కన్నడ నటుడు కిచ్చా సుదీప్ ప్రధాని నరేంద్రమోదీపై ప్రశంసలు కురిపించారు. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా ఇప్పటికే దేశ ప్రధాని మోదీపై, భారత సైన్యంపై ప్రశంసల జల్లు కురిపించిన సుదీప్ ఇప్పుడు మోదీకి ఓపెన్ లెటర్ రాసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

ఇటీవల తన తల్లి మరణం సందర్భంగా మోదీ సానుభూతి తెలియచేస్తూ లేఖ రాశానని,ఆసమయంలో ఆయన మాటలు తనకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చాయని అన్నారు. ఇవాళ ఒక కృతజ్ఞుడైన కొడుకుగానే కాక, గర్వించదగ్గ భారతీయుడిగా కూడా ఈ లేఖ రాస్తు న్నానని సుదీప్ తెలిపారు. మాటల మనిషి కాకుం డా ప్రధాని మోదీ చేతల మనిషి అని, సరైన నాయకత్వానికి ఆయన ప్రతీక అని కిచ్చా సుదీప్ అన్నారు. ప్రతి కన్నడిగతో పాటు కన్నడ చిత్రసీమ మొత్తం మోదీ వెన్నంటి ఉంటుందని కిచ్చా సుదీప్ తెలిపాడు. ప్రధాని మోదీ ధైర్యం తామందరికీ స్ఫూర్తి అని అన్నారు. మోదీ నాయకత్వం లో రక్షణ దళాలు ప్రదర్శిస్తున్న శౌర్యం అమోఘమని కిచ్చా సుదీప్ చెప్పారు. లేఖ చివరలో జై హింద్, జై కర్ణాటక, జై భారత్ అంటూ సుదీప్ పేర్కొన్నారు.

## 'ఆపరేషన్ సిందూర్' పోస్టర్ విడుదల..

### కొద్ది గంటల్లోనే క్షమాపణలు

'ఆపరేషన్ సిందూర్' పేరుతో బాలీవుడ్లో ఓ సినిమా సిద్ధం కానుంది. ఇదే విషయాన్ని తెలియజేస్తూ చిత్ర దర్శకుడు ఉత్తమ్ మహేశ్వరీ టైటిల్ పోస్టర్‌ను విడుదలచేశారు. దేశ సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ సమయం, సందర్భం లేకుండా టైటిల్ రివీల్ చేసినందుకు నెటిజన్ల నుంచి విమర్శలు ఎదురు కావడంతో చివరకు ఆయన క్షమాపణలు చెబుతూ కొద్దిగంటల్లోనే ప్రకటన విడుదల చేశారు. ఎదుటివ్య క్తుల మనోభావాలను దెబ్బతీసే ఉద్దేశం తనకులేదని ఆయన స్పష్టం చేశారు.డబ్బు లేదా కీర్తికోసం తానుఇలాంటి పని చేయలేదని అన్నారు.




"ఆపరేషన్ సిందూర్‌పై సినిమా చేస్తున్నట్లు ప్రకటించినందుకు క్షమా పణలు తెలియజేస్తున్నా. ఇతరుల మనోభావాలను గాయపర చడం లేదా రెచ్చగొట్టడం నా ఉద్దేశంకాదు. మన సైనికుల ధైర్య సాహసాలను, త్యాగా న్ని, నాయకత్వాన్ని ఒక శక్తిమంతమైన కథగా వెండితెరపైకి తీసుకురా వాలని అనుకున్నా. దేశం పట్ల నాకున్న గౌరవాన్ని తెలియజేస్తూ దీనిని రూపొందించాలనుకున్నా. అంతేకానీ, డబ్బు లేదా ఫేమ్ కోసం కాదు.అయితే పోస్టర్ విడుదల చేసిన సమయం కొంతమందికి అసౌకర్యం కలిగించి ఉండొచ్చు. అందుకు క్షమాపణలు చెబుతున్నా. ఇది కేవలం సినిమా మాత్రమే కాదు ఇది దేశ ప్రజల ఎమోషన్" అని ఆయన రాసుకొచ్చారు.

'ఆపరేషన్ సిందూర్' పేరుతో సినిమా చేసేందుకు ఎన్నో నిర్మాణ సంస్థలు ఆసక్తి చూపించాయి. ఆ టైటిల్‌ను సొంతం చేసుకునేందుకు పోటీపడ్డాయి. నిక్కీవిక్కీ భగ్నానీ ఫిల్మ్స్ పతాకంపై ఉత్తమ్ మహేశ్వరీ దర్శకత్వంలో 'ఆపరేషన్ సిందూర్ పేరుతో శుక్రవారం రాత్రి సినిమా ప్రకటించారు. పహల్గాం ఘటన, మన సైనికుల ధైర్య సాహసాలను తెలియజేసేలా ఈ సినిమా ఉంటుందని సమాచారం.

## హాలీవుడ్‌లోకి కంగన



ఎమర్జెన్సీ' చిత్రంతో ఇటీవలే ప్రేక్షకుల్ని పలకరించిన బాలీవుడ్ కథానాయిక కంగనా రనౌత్ హాలీవుడ్‌లో అడుగుపెట్టనుంది. దర్శకురాలిగా, నటిగా వైవిధ్యమైన కథలతో ఇప్పటికే బాలీవుడ్లో మంచి క్రేజ్ సంపాదించుకున్న ఈమె.. ఇప్పుడు హాలీవుడ్లోకి అడుగుపెట్టడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఆమె ప్రధాన పాత్రలో బ్లెస్డ్ బి ది ఈవిల్ అనే ఇంగ్లిష్ చిత్రంలో నటిస్తున్నట్లు సమాచారం. కంగన కోసం లయన్ మూవీస్ ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్న చిత్రమిది. గర్భస్రావం తర్వాత బిడ్డను కోల్పోయిన బాధలో ఉంటుంది ఓ జంట. మళ్లీ కొత్త జీవితాన్ని ప్రారంభించాలను కుంటున్న వారిని ఓ దుష్ట శక్తి ఎలాంటి తిప్పలు పెట్టిందనే కథాంశం చుట్టూ ఈ సినిమా తిరుగుతుంది.

అతీంద్రియ శక్తులు.. జానపద కథల నేపథ్యంలో అనురాగ్ రుద్ర దీన్ని తీర్చిదిద్దుతున్నారు. టైలర్ పోసి, స్కార్లెట్ రోజ్, తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ వేసవిలో న్యూయార్క్ చిత్రీకరణను మొదలు పెట్టనున్నారని కంగన సన్నిహిత వర్గాలు తెలిపాయి.

## ప్రదీప్ రంగనాథన్ 'డ్యూడ్'

ప్రదీప్ రంగనాథన్ తను దర్శకత్వం వహించిన బ్లాక్ బస్టర్ మూవీ 'లవ్ టుడే' తో నటుడిగా అరంగేట్రం చేశాడు. ఆ తర్వాత తమిళ, తెలుగు రెండింటిలోనూ విజయం సాధించిన తన రీసెంట్ హిట్ 'డ్రాగన్' తో పాపులరిటీ సాధించాడు. వరుస విజయాలతో ప్రదీప్ రంగనాథన్ తమిళ సినిమాల్లోనే కాకుండా తెలుగులో కూడా పేరు తెచ్చుకున్నాడు. పాన్ – ఇండియా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్.. ప్రదీప్ రంగనాథన్ హీరోగా తమిళ, తెలుగు ద్విభాషా ప్రాజెక్టు చేస్తోంది. కీర్తిశ్వరన్ ఈ చిత్రంతో డైరెక్టర్ గా పరిచయం కాబోతున్నాడు. 'ప్రేమలు' చిత్రంతో అందరినీ అలరించిన మమిత బైజు హీరోయిన్ గా నటిస్తుండగా, సీనియర్ నటుడు శరత్ కుమార్ ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించారు. ఈ సినిమా పేరును శనివారం రివీల్ చేశారు. దీనికి 'డ్యూడ్' అనే పేరు పెట్టారు నిర్మాతలు నవీన్ ఎర్నేని, రవిశంకర్.

డ్యూడ్' టైటిల్ ను ప్రకటించడంతో పాటు ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. అలానే ఈ చిత్రాన్ని తమిళ, తెలుగు భాషల్లో దీపావళి కానుకగా విడుదల చేయబోతున్నట్టు ప్రకటించారు. తాజా పోస్టర్ యూత్ ని ఆకట్టుకునే విధంగా ఉంది. ఇందులో ప్రదీప్ రంగనాథన్ ఇంటెన్స్ అవతార్‌లో, ముఖం మీద గాయాలు, చేతిలో మంగళసూత్రం పట్టుకుని కనిపించాడు. టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ లో సూచించినట్టుగా, 'డ్యూడ్' మోడరన్ ట్విస్ట్ తో కూడిన పూర్తి ఎంటర్టైనర్ గా రూపొందబోతున్నట్టు తెలుస్తోంది.

'డ్యూడ్' చిత్రానికి యంగ్ సెన్సేషన్ సాయి అభ్యాంకర్ మ్యూజిక్ అందిస్తుండగా, నికేత్ బొమ్మి సినిమాటోగ్రఫీని నిర్వహిస్తున్నారు. లతా నాయుడు ప్రొడక్షన్ డిజైనర్‌గా, భరత్ విక్రమన్ ఎడిటర్‌గా పని చేస్తున్నారు. ప్రొడక్షన్ ఇప్పటికే పూర్తి స్థాయిలో జరుగుతుండటంతో దీపావళికి సరైన ఎంటర్టైనర్ ను అందించడానికి టీం వేగంగా పని చేస్తోంది. 'డ్యూడ్' చిత్రాన్ని తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషలలో సైతం విడుదల చేయబోతున్నారు.